మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 7-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 308 Issue: 308

07 మే 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:51 సూర్యాస్తమయం - సా. 6:34 తిథి పంచమి ఉ. 10:13 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం పూర్వాషాఢ సా. 6:36 వరకు తరువాత ఉత్తరాషాఢ యోగం సాధ్య రా. 1:50ం వరకు కరణం తైతుల ఉ. 10:13 వరకు గరజ రా. 11:19 వరకు వర్జ్యం తె. 3:36 నుండి తె. 5:22 వరకు దుర్ముహూర్తం ఉ. 10:05 నుండి ఉ. 10:56 వరకు మ. 3:10 నుండి సా. 4:01 వరకు రాహుకాలం మ. 1:48 నుండి మ. 3:23 వరకు యమగండం తె. 5:51 నుండి ఉ. 7:26 వరకు గుళికాకాలం ఉ. 9:01 నుండి ఉ. 10:37 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:15 నుండి తె. 5:03 వరకు అమృత ఘడియలు మ. 1:22 నుండి మ. 3:10 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:38 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial







# కలిశారు..! నేనొప్పుకోను కలుద్దామా..!

## టీవీకే-కాంగ్రెస్ దోస్తీ.. విజయ్‌కు కాంగ్రెస్ మద్దతు

తమిళనాడు రాజకీయ యవనికపై సరికొత్త శకం ఆరంభమైంది. దశాబ్దాల ద్రవిడ రాజకీయాల ముద్రను చెరిపివేస్తూ వెండితెర వేల్పు, దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) రాష్ట్ర అధికార పీఠాన్ని కైవసం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అద్భుత విజయాన్ని నమోదు చేసిన టీవీకేకు, జాతీయ పార్టీ కాంగ్రెస్ అనూహ్య మద్దతు తెలిపింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం కోసం ప్రయత్నిస్తున్న తరుణంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) విడుదల చేసిన ప్రకటన రాజకీయ సమీకరణాలను ఒక్కసారిగా మార్చివేసింది.

చెన్నై: టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్ బేషరతుగా కాకుండా ఒక నైతిక షరతుతో మద్దతు ప్రకటించింది. 'రాష్ట్రంలో మతతత్వ శక్తులు పాగా వేయకుండా చూడాలి. లౌకికవాద భావజాలాన్ని కాపాడటమే మా ప్రధాన లక్ష్యం. పెరియార్, అంబేద్కర్ ఆశయాల బాటలో నడిచేందుకు విజయ్ అంగీకరించిన నేపథ్యంలోనే మేము ఈ నిర్ణయం తీసుకున్నాం' అని కాంగ్రెస్ తన అధికారిక లేఖలో స్పష్టం చేసింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఐదుగురు ఎమ్మెల్యేలు నేరుగా టీవీకే ప్రధాన కార్యాలయానికి వెళ్లి విజయ్‌ను కలవడం విశేషం. దళపతికి పార్టీ కండువా కప్పి అభినందనలు తెలపడమే కాకుండా రాబోయే ప్రభుత్వంలో భాగస్వాములవుతామని హామీ ఇచ్చారు. తమిళనాడు అసెంబ్లీలోని మొత్తం 234 స్థానాల్లో మేజిక్ ఫిగర్ 118 సాధించాల్సి ఉండగా టీవీకే అతిపెద్ద పార్టీగా తరువాయి 2 వ పేజీలో...

## విజయ్‌కు గవర్నర్ షాక్.. ప్రభుత్వ ఏర్పాటుకు నో పర్మిషన్

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైన టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ నుంచి ఊహించని షాక్ తగిలింది. ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి కోరుతూ టీవికె అధినేత విజయ్.. బుధవారం గవర్నర్‌ను కలిసిన సంగతి తెలిసిందే. లోక్‌భవన్ చేరుకున్న విజయ్.. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. 112 మంది ఎమ్మెల్యేల మద్దతు లేఖను గవర్నర్‌కు అందించారు విజయ్. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ నుంచి విజయ్‌కు అనుమతి లభించనట్లు తెలిసింది.

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ సామర్థ్యం 234 సీట్లు కాగా.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 118 మంది ఎమ్మెల్యేలు. ఎన్నికల్లో విజయ్ టీవీకే పార్టీ మ్యాజిక్ ఫిగర్ దాటలేకపోయింది. అయితే విజయ్‌కు కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించటంతో ఈ బలం.. 112కు చేరింది. అయితే మ్యాజిక్ ఫిగర్ సాధించలేకపోవటంతో ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ నుంచి విజయ్‌కు ఇంకా అనుమతి లభించనట్లు తెలిసింది. ఈ విషయంలో విజయ్, గవర్నర్‌కు సర్దిచెప్పలేకపోయినట్లు సమాచారం. మరోవైపు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే 47 సీట్లలో విజయం సాధించింది. ప్రభుత్వ ఏర్పాటు కోసం విజయ్.. అన్నాడీఎంకే కలిసి వెళ్తారని తొలుత వార్తలు వచ్చాయి. అయితే విజయ్.. ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు ఉన్న కాంగ్రెస్ పార్టీతో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమయ్యారు. అయినప్పటిక-2 వ పేజీలో...

## డీఎంకే, అన్నాడీఎంకే పొత్తు?.. తమిళనాడులో సంచలనం

దశాబ్దాల క్రితం డీఎంకే నుంచి విడిపోయి అన్నాడీఎంకేగా ఏర్పడి.. అప్పటి నుంచి ఇప్పటి వరకు బద్ధ శత్రువులుగా అధికారం కోసం పోరాటం చేస్తున్న రెండు పార్టీలు ఒక్కటి కానున్నట్లు వార్తలు రావడం ప్రస్తుతం రాజకీయాల్లో పెను సంచలనం రేపుతున్నాయి. డీఎంకే, అన్నాడీఎంకే కలిసి తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు రహస్య చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

చెన్నై: ఒకవేళ ఈ చర్చలు ఫలించి.. ద్రవిడ పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే.. అది తమిళనాడులో దశాబ్దాల డీఎంకే, అన్నాడీఎంకే దాయాదుల పోరుకు ఫుల్‌స్టాప్ పడుతుందని అంతా భావిస్తున్నారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే పార్టీ 59 స్థానాల్లో విజయం సాధించింది. అదే సమయంలో అన్నాడీఎంకే పార్టీ 47 సీట్లలో గెలిచింది. అయితే ఈ రెండు పార్టీలు కలిస్తే వీరి బలం 106 సీట్లకు చేరుకుంటుంది. తమిళనాడు అసెంబ్లీలో మేజిక్ ఫిగర్ 118 కాగా.. మెజార్టీని సాధించాలంటే వీరికి మరో 12 సీట్లు కావాల్సి ఉంటుంది. దీంతో మిగిలిన చిన్న పార్టీల మద్దతు కోరే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే సీపీఐ 2, సీపీఎం 2, వీసీకే 4 వంటి పార్టీలు కూడా మద్దతు ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల మద్దతు లేకుండా తరువాయి 2 వ పేజీలో...

## సువేందు అధికారి పీఏ దారుణ హత్య

పశ్చిమ బెంగాల్‌లో దారుణం

2

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,044 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,902 |

## 17 కార్పొరేషన్లకు చైర్మన్లు

### 11 మంది వైస్ చైర్మన్లు.. తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

తెలంగాణలో ఎప్పటి నుంచో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లకు చైర్మన్లను.. 11 మంది వైస్ చైర్మన్లను నియమిస్తూ.. కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నామినేటెడ్ పోస్టులకు ఎంపిక చేసిన వారి పేర్లను ప్రకటించారు.



హైదరాబాద్, మే 6 (ఈవార్తలు): మొత్తం 17 కార్పొరేషన్లకు చైర్మన్లు, 11 కార్పొరేషన్లకు వైస్ చైర్మన్లను నియమిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొన్ని విడతలుగా రాష్ట్రంలో ఉన్న నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయగా.. తాజాగా మరిన్ని పోస్టులకు పలువురు నేతలను ఎంపిక చేశారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ - బస్వరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ - పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్

కమ్మ కార్పొరేషన్ చైర్మన్ - బండి రమేశ్, వైస్ చైర్మన్ - పరుచూరి మురళి

వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ - గట్టు తిమ్మప్ప, వైస్ చైర్మన్ - బోయ నగేష్

యాదవ కార్పొరేషన్ చైర్మన్ - రఘునాథ్ యాదవ్, వైస్ చైర్మన్ - గజ్జి భాస్కర్ యాదవ్

వడ్డెర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ - గుంజా -2 వ పేజీలో...



## కాంగ్రెస్‌కు పిండం పెట్టాలి

### అప్పుడే మంచి రోజులొస్తాయి.. ఎగవేతల సీఎం రేవంత్ రెడ్డి

### రైతుల రక్తం తాగిన పార్టీ కాంగ్రెస్.. హనుమకొండ రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్

రైతు డిక్లరేషన్ అనేది ఒక బోగస్ పత్రమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. డిక్లరేషన్ పేరిట రైతులకు చిత్తు కాగితం ఇచ్చి మోసం చేశారని మండిపడ్డారు. డిక్లరేషన్ ఇచ్చిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. హనుమకొండలో నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ.. డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని సూచించారు.

హనుమకొండ, మే 6 (ఈవార్తలు): రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఎందుకు ఇవ్వడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ జరిగిందా అని అడిగారు. రైతు కూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. అన్ని పంటలు బోనస్ ఇచ్చి కొంటామన్నారని గుర్తుచేశారు. కౌలు రైతులకు ఎకరానికి రూ.14వేలు వస్తుందా అని ప్రశ్నించారు. పంటబీమా పథకం తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



వన్యప్రాణి సంరక్షణకు, టూరిజానికి మరింత మద్దతు ఇచ్చే దిశగా ఇండోనేషియా కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఏనుగులపై సవారీని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## నా కోసం ట్రాఫిక్ ఆపొద్దు

### కాన్వాయ్‌తో ప్రజలు ఇబ్బందిపడొద్దు.. డీజీపీకి సీఎం రేవంత్ ఆదేశాలు

సీఎం వస్తున్నారంటే చాలు.. రోడ్లపై ఎక్కడికక్కడ వాహనాలను నిలిపేస్తూ ఉంటారు. దీంతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోతూ ఉంటుంది. అయితే హైదరాబాద్ వంటి నగరాల్లో రద్దీ సమయాల్లో సీఎం కాన్వాయ్ కోసం ట్రాఫిక్ నిలిపివేయడం వల్ల రోడ్లపై ప్రజలు నరకయాతన పడుతూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తాను పదవి చేపట్టిన తర్వాత తన కాన్వాయ్ కోసం.. రోడ్లపై వాహనదారులను ఇబ్బంది పెట్టవద్దని అధికారులు, పోలీసులకు సూచించిన సంగతి తెలిసిందే.



హైదరాబాద్, మే 6 (ఈవార్తలు): ఈ క్రమంలోనే తాజాగా సీఎం రేవంత్.. సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. తన కాన్వాయ్ కోసం రోడ్లపై భారీగా ట్రాఫిక్ జాం కావడంతో ప్రజలు ఇబ్బంది పడతారని పేర్కొన్నారు. తాజాగా బుధవారం రోజున సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా తన నివాసం నుంచి శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. సీఎం కాన్వాయ్ వెళుతున్న మార్గంలో.. తరువాయి 2 వ పేజీలో...

## 51 మంది డాక్టర్లు శాశ్వత తొలగింపు



### ఏపీ ప్రభుత్వం సంచలన నిర్ణయం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. 51 మంది ప్రభుత్వ డాక్టర్లను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్రమశిక్షణ, ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించటమే లక్ష్యంగా విధులకు డుమ్మా కొడుతున్న వైద్యులపై చర్యలు తీసుకుంది. అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న వైద్యులపై ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమరావతి, మే 6 (ఈవార్తలు): పవిత్రమైన వైద్య వృత్తిలో ఉంటూ.. బాధ్యతారాహిత్యాన్ని ఎంతమాత్రం సహించబోమన్న మంత్రి సత్యకుమార్ యాదవ్.. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో ఉన్న 51 మంది డాక్టర్లను విధుల నుంచి శాశ్వతంగా తప్పిస్తున్నట్లు ప్రకటించారు. ఈ 51 మందిలో బోధనాసుపత్రులలోని అసోసియేట్ ప్రొఫెసర్లు ఎనిమిది మంది, 41 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారు. ఈ 51 మంది డాక్టర్లతో పాటుగా మరో ముగ్గురు ప్రొఫెసర్లపైనా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ప్రభుత్వం -2 వ పేజీలో...



## సీపీ సుమతి స్పెషల్ ఆపరేషన్

అర్ధరాత్రి సామాన్య మహిళగా బస్టాండ్‌లో వెయిటింగ్

40 మంది యువకుల వేధింపులు..

అధికులు విద్యార్థులే

మల్కాజిగిరి, మే 6 (ఈవార్తలు): మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బీ సుమతి ఆకతాయిల ఆగడాలపై ఉక్కుపాదం మోపారు. ఈవ్ టీజింగ్‌ను అరికట్టేందుకు తానే స్వయంగా -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

7.5.2026

**మేషం:** అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ప్రయాణాలు చివరి నిమిషంలో వాయిదా పడతాయి. వ్యయప్రయాసలతో కొన్ని పనులు పూర్తి అవుతాయి. ధనవ్యయ సూచనలు ఉన్నవి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో చికాకులు మరింత పెరుగుతాయి.

**వృషభం:** దూరపు బంధువుల నుండి విలువైన సమాచారం అందుతుంది. వృత్తి ఉద్యోగాలలో మీ పనితీరు అందరినీ ఆకట్టుకుంటారు. ఇంటా బయట ఆశ్చర్యకర సంఘటనలు చోటుచేసుకుంటాయి. నూతన వస్తులాభాలు ఉంటాయి. ఆకస్మిక ధనలబ్ధి కలుగుతుంది. వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.

**మిధునం:** ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సహాయ సహకారాలు అందుతాయి. విద్యార్థుల అంచనాలు అందుకుంటారు. సమాజంలో పరపతి పెరుగుతుంది. నూతన వాహన యోగం ఉన్నది. దైవదర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలు, ఉద్యోగాలు సజావుగా సాగుతాయి.

**కర్కాటకం:** వ్యాపార వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చేసి నష్టాలు ఎదుర్కొంటారు. చేపట్టిన పనులలో శ్రమ తప్పదు. బంధువులతో మాట పట్టింపులు కలుగుతాయి. గృహమున కొందరి ప్రవర్తన శిరో బాధ కలిగిస్తుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. వ్యాపారాలు, ఉద్యోగాలు నత్తనడకన సాగుతాయి.

**సింహం:** మానసిక సమస్యలు బాధిస్తాయి. మిత్రులతో చిన్నపాటి విభేదాలు ఉంటాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ముఖ్యమైన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. ఎంత శ్రమపడిన పనులు ముందుకు సాగవు. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి అధికమవుతుంది.

**కన్య:** ఆపదల నుండి శుభవార్తలు అందుకుంటారు. వ్యాపార వ్యవహారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్చుకుంటారు. నూతన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. ఉద్యోగమున మీ విలువ మరింత పెరుగుతుంది.

**తుల:** మిత్రులతో ఊహించని మాటపట్టింపులు కలుగుతాయి. ఆరోగ్యం మందగిస్తుంది. ధన పరమైన చికాకులు పెరుగుతాయి. గృహ వాతావరణం చికాకుగా ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు కలుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు నిదానంగా సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

**వృశ్చికం:** నూతన వాహనం కొనుగోలు చేస్తారు. నిరుద్యోగుల చిరకాల స్వప్నం నెరవేరుతుంది. వ్యాపారాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయి. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. ఆప్తుల నుంచి శుభవార్తలు అందుతాయి. ఉద్యోగాలలో అధికారులతో చర్చలు సఫలం అవుతాయి.

**ధనస్సు:** చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు తప్పవు. ఇంటా బయట శ్రమాధిక్యత పెరుగుతుంది. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. మిత్రుల నుంచి ఋణ ఒత్తిడులు పెరుగుతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాల విస్తరణ ప్రయత్నాలు మందగిస్తాయి. ఉద్యోగాలలో ఒడిదుడుకులు పెరుగుతాయి.

**మకరం:** దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. దైవచింతన పెరుగుతుంది. ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో ఉన్నతి కలుగుతుంది.

**కుంభం:** విలువైన వస్త్ర ఆభరణలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. వాహన అనుకూలత కలుగుతుంది. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. అధికారులతో చర్చలు సఫలం అవుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు మరింత అనుకూలంగా సాగుతాయి.

**మీనం:** ముఖ్యమైన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ కలిగిస్తాయి. ఆర్థిక ఇబ్బందులు అధికమౌతాయి. వృత్తి ఉద్యోగాలలో శ్రమ తప్పదు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు పెట్టకపోవడం మంచిది.

# కాంగ్రెస్‌కు పిండం పెట్టాలి

మొదటి పేజీ తరువాయి

ఎక్కడకు పోయిందని అడిగారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఎప్పుడిస్తారన్నారు. దుక్కి దున్నే రైతులను దారుణంగా వంచించారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్‌ది మెగా రైతు మేళా కాదు.. దగా రైతు మేళా అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే డేంజర్ అని సెటైర్ వేశారు. చెడ్డీ గ్యాంగ్ కంటే డేంజర్ కాంగ్రెస్ నాయకులు అని విమర్శించారు. డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో క్రమం తప్పకుండా రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో నాట్లు వేసే సమయంలో రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ తీసుకొచ్చిన రైతుబంధు పథకాన్ని 12 రాష్ట్రాలు కాపీ కొట్టాయని తెలిపారు. గతంలో రైతులు పెట్టుబడి కోసం అప్పుల పాలయ్యే వారని గుర్తుచేశారు. రైతులకు 11 విడతలుగా రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. కానీ కాంగ్రెస్ వచ్చాక రైతు బంధు సమయానికి ఇవ్వడం లేదని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల ముందు ఓట్ల కోసం ఒక్కసారే రైతు భరోసా ఇచ్చారని అన్నారు. డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని కేటీఆర్ అన్నారు. రైతన్నలు కాళ్లు పట్టుడు బంద్ చేసి.. కాంగ్రెస్ వాళ్ల కాలర్ పట్టాలని సూచించారు. దండం పెట్టడం కాదు.. కాంగ్రెస్ పార్టీకి పిండం పెట్టండి.. అట్లయితేనే రైతులకు మంచి రోజులు వస్తాయని అన్నారు. తాలు తీస్తే రైతులు నీ తోలు తీస్తారని సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. మక్కలు కొనకపోతే నీ ప్రభుత్వం వెయ్యి ముక్కలవుతుందని వార్నింగ్ ఇచ్చారు.



### రుణమాఫీపై రేవంత్‌కు సవాల్

సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. వరంగల్ వచ్చి భద్రకాళి అమ్మవారి మీద ఒట్టుపెట్టి రుణమాఫీ చేస్తానని అన్నాడని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఏ ఊరికైనా వెళ్లి అడుగుదాం.. ఒక్క ఊరిలోనైనా రైతులందరికీ రుణమాఫీ జరిగిందంటే రాజీనామా చేస్తానని సవాలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ చారానా.. టోపీ బారానా అని ఎద్దేవా చేశారు. రుణమాఫీ పూర్తికాక రైతులు పురుగుల మందు తాగారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో అన్నీ దందాలు, కమీషన్లు, కొట్లాటలే అని విమర్శించారు. రేవంత్ రెడ్డి 69సార్లు ఢిల్లీకి వెళ్లాడని.. కానీ 69 పైసలు కూడా తేలేదని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లి రేవంత్ రెడ్డి కప్పం కడుతున్నాడని తెలిపారు. రాష్ట్రంలో రాహుల్ బంధు నడుస్తుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, ప్రజల గురించి పట్టించుకునే వాళ్లే లేరని అన్నారు. రైతులకు ఇవ్వడానికి పైసలు లేవు.. కానీ రాహుల్ గాంధీకి మాత్రం మూటలు పంపిస్తున్నాడని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులను నంబర్‌వన్ స్థానంలో నిలిపారని కేటీఆర్ గుర్తుచేశారు. ఆగమైన తెలంగాణను బాగుచేసింది బీఆర్ఎస్ అని తెలిపారు. రైతు ప్రగతికి కేసీఆర్ అద్భుతమైన పథకాలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్ కంటే రైతును బాగా చూసుకున్న నాయకుడు దేశంలోనే లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో రైతు ప్రగతికి విప్లవం సృష్టించామని అన్నారు. పదేళ్లలో రైతులకు రూ.5లక్షల కోట్లు ఖర్చుపెట్టిన నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. కేసీఆర్ హయాంలో సాగు పెరిగి వరంగల్‌లో భూముల రేట్లు పెరిగాయని అన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చాక భూముల ధరలు పడిపోయాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కోసం వానల్లో, ఎండల్లో రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్సెట్టిపేట కొనుగోలు కేంద్రంలో గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ వెనుకటి రోజులు వస్తున్నాయని వాపోయారు. వరంగల్ జిల్లా కాకతీయ పౌరుషాల గడ్డ అని కేటీఆర్ అన్నారు. ఇది త్యాగాల గడ్డ.. పోరాటాల గడ్డ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వరంగల్ కదం తొక్కిందని గుర్తుచేశారు. వరంగల్‌లో ఏం మొదలుపెట్టినా విజయవంతమవుతుందని తెలిపారు. వరంగల్‌లో పోరాటాల విల్లు ఎక్కుపెడితే.. ద్రోహుల గుండె జల్లుమంటుందని పేర్కొన్నారు. అమలుకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మండిపడ్డారు. కొందరు కాంగ్రెస్ నేతలు రైతుల ఓట్ల కోసం గాలం వేశారని అన్నారు. వరంగల్ గడ్డ మీద నుంచే కాంగ్రెస్ పార్టీ రైతుల డిక్లరేషన్ ప్రకటించిందని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పెద్ద దొంగలు అని కేటీఆర్ విమర్శించారు. రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ సభ పెట్టి దొంగ హామీలిచ్చారని మండిపడ్డారు. ఇవాల్టితో కాంగ్రెస్ నయవంచనకు నాలుగేళ్లు నిండాయని తెలిపారు. రైతుల రక్తం తాగిన పార్టీ కాంగ్రెస్ అని మండిపడ్డారు. రైతు డిక్లరేషన్‌లో 34 హామీలిచ్చారని పేర్కొన్నారు. 34 హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని విమర్శించారు. బాండ్ పేపర్లు రాసి మరీ కాకమ్మ కబుర్లు చెప్పారని మండిపడ్డారు. ఆ దొంగ హామీలు నమ్మి రైతులు కాంగ్రెస్‌కు ఓటేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తయిన రైతు డిక్లరేషన్ ఊసే లేదని కేటీఆర్ విమర్శించారు. రైతు డిక్లరేషన్‌పై అడిగితే ఒక్కరూ మాట్లాడటం లేదని అన్నారు. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు.

### బీఆర్ఎస్ నాలుగు తీర్మానాలు

1. కాంగ్రెస్ రాబంధు పాలనలో వెయ్యి మందికిపైగా రైతులు చనిపోయారని.. రోడ్డున పడ్డ ఒక్కో రైతు కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.
2. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన 34 హామీలను వెంటనే అమలు చేయాలి.
3. అన్ని పంటలను ఆంక్షలు లేకుండా రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలి.
4. రెండు లక్షల రుణమాఫీ పూర్తి కాని రైతులకు రుణ విముక్తి కల్పించాలి. రైతుబంధు సక్రమంగా వేయాలి. రైతు బీమా పథకాలను వెంటనే పునరుద్ధరించాలి.

# నా కోసం ట్రాఫిక్ ఆపొద్దు

మొదటి పేజీ తరువాయి

పోలీసులు ట్రాఫిక్ ఆపేయడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లే సమయంలో వాహనదారులను గంటల తరబడి రోడ్లపై ఆపొద్దంటూ.. తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సీఎం కాన్వాయ్ కోసం సామాన్య ప్రజలకు ఆటంకం కలిగించవద్దని.. కాన్వాయ్ వెళ్లే మార్గంలో కాకుండా.. ఎదురుగా, అవతలి వైపు వెళ్లే వాహనాలను ఆపి ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి తాజాగా ఇచ్చిన ఆదేశాలతో డీజీపీ సీవీ ఆనంద్.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా త్వరలోనే కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ బ్యూరోను ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ వెల్లడించారు. ఇక నుంచి సీఎం, వీఐపీ కాన్వాయ్‌లు వెళ్లే సమయంలో.. ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయకూడదని నిర్ణయించారు. ఒకవైపు సీఎం కాన్వాయ్ వెళ్తే మరోవైపు సింగిల్ లైన్‌లో మిగిలిన వాహనాలను అనుమతించేలా ప్రణాళికలు రెడీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రోడ్లపై రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో.. ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే రెడీ చేసుకోవాలని.. ట్రాఫిక్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని పేర్కొన్నారు. మరోవైపు.. త్వరలో వర్షాకాలం రానున్న నేపథ్యంలో రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించాలని.. ఆ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో ట్రాఫిక్ లేకుండా ఎప్పటికప్పుడు అలర్ట్‌గా ఉండాలని స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డుపై రూల్స్‌కు విరుద్ధంగా వాహనాలను పార్క్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని.. వాటిని నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అనేది కేవలం ట్రాఫిక్ విభాగం బాధ్యత మాత్రమే కాదని.. శాంతి భద్రతల విభాగం కూడా ఇందులో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

# 51 మంది డాక్టర్లు శాశ్వత తొలగింపు

మొదటి పేజీ తరువాయి

శాశ్వతంగా తొలగించిన వైద్యులలో కొంతమంది ఆరేళ్లు, మరికొందరు ఏడేళ్ల నుంచి విధులకు హాజరు కానట్లు తెలిసింది. వీరంతా సొంత వ్యాపకాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఏపీ సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్–1964 ప్రకారం.. సంవత్సరానికి మించి విధులకు హాజరు కాకపోతే.. అలాంటివారిని రాజీనామా చేసినట్లుగా పరిగణించే అధికారాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటాయి. ఈ రూల్ ప్రకారం అలాంటివారికి మొదట షోకాజ్ నోటీసులు జారీ చేస్తారు. వారి నుంచి వివరణ తీసుకుంటారు. ఆ తర్వాత వారిపై చర్యలు తీసుకుంటారు. అయితే ఈ 51 మంది వైద్యులకు వివరణ ఇచ్చేందుకు సమయం ఇచ్చినప్పటికీ.. వారి నుంచి ఎలాంటి స్పందనా లేకపోవటంతో ఏపీ వైద్యారోగ్యశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. వీరితో పాటుగా మరో 33 మంది వైద్యులకు కూడా ఛార్జ్ మెమోలు జారీ చేశారు. వీరంతా ఏడాదిలోపుగా విధులకు గైర్హాజరు అవుతున్నట్లు తెలిసింది. వీరిలో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. ఈ 33 మంది వైద్యులు నిర్ణీత గడువులోగా విధుల్లో చేరకుంటే.. వీరిని కూడా విధుల నుంచి తొలగించనున్నట్లు ప్రభుత్వం హెచ్చరించింది. దీంతో 11 మంది డాక్టర్లు తిరిగి డ్యూటీలలో చేరినట్లు సమాచారం.

# సీపీ సుమతి స్పెషల్ ఆపరేషన్

మొదటి పేజీ తరువాయి

రంగంలోకి దిగి, అర్ధరాత్రి ఓ బస్టాండ్‌లో సామాన్య మహిళగా నిలబడ్డారు. ఆమెను గుర్తుపట్టని పోకిరీలు వేధించడంతో, అక్కడే మాటువేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నిన్న అర్ధరాత్రి మల్కాజిగిరి పరిధిలోని ఓ బస్టాండ్‌కు సీపీ సుమతి ఒంటరిగా చేరుకున్నారు. ఆమె ఉన్నతాధికారి అని తెలియని సుమారు 40 మంది పోకిరీలు ఆమె చుట్టూ చేరారు. రకరకాల ప్రశ్నలతో ఇబ్బంది పెట్టారు. ఈ క్రమంలో సాధారణ మహిళలు ఎదుర్కొనే వేధింపులను ఆమె స్వయంగా అనుభవించారు. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది విద్యార్థులే ఉండటం ఆందోళన కలిగించే విషయం. ఆకతాయిల వేధింపులు శ్రుతి మించడంతో అక్కడికి చేరుకున్న ప్రత్యేక పోలీస్ బృందాలు వారిని అదుపులోకి తీసుకున్నాయి. అనంతరం యువకులందరికీ కౌన్సెలింగ్ ఇచ్చి, భవిష్యత్తులో ఇలాంటి పనులకు పాల్పడవద్దని హెచ్చరించి పంపించారు. మహిళల భద్రత విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని సీపీ సుమతి ఈ ఆపరేషన్ ద్వారా స్పష్టమైన సంకేతాలు పంపారు.



# కలిశారు..!

మొదటి పేజీ తరువాయి

అవతరించినప్పటికీ స్వల్ప దూరంలో నిలిచింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ మద్దతు విజయ్‌కు 'సంజీవని'గా మారింది. ఒకవైపు విజయ్ ప్రభుత్వ ఏర్పాటు పనుల్లో నిమగ్నమై ఉండగా మరోవైపు డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌ను సూపర్ స్టార్ రజనీకాంత్ కలవడం రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. రాజకీయంగా విజయ్ ఎదుగుతున్న సమయంలో మాజీ సీఎం, సీనియర్ రాజకీయ వేత్త అయిన స్టాలిన్‌తో రజనీ భేటీ అవ్వడం వెనుక ఉన్న మర్మమేమిటనేది అస్పష్టంగా ఉంది.

# నేనొప్పుకోను

మొదటి పేజీ తరువాయి

మరో ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు అవసరం కావటంతో... చిన్న పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 118 ఎమ్మెల్యేల మద్దతును నిరూపించుకోవడంలో టీవీకే చీఫ్ విజయ్ ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ప్రమాణ స్వీకారాన్ని రద్దు చేశారు.

# కలుద్దామా..!

మొదటి పేజీ తరువాయి

ప్రాంతీయ పార్టీలతోనే అధికారాన్ని చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇలా చేయడం వల్ల ద్రవిడ పార్టీల మనుగడ ప్రశ్నార్థకం కాకుండా రెండు పార్టీలు అడ్డుకున్నట్లు కానుంది. అయితే ఇది జరుగుతుందా లేదా డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు కలుస్తాయా లేదా అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు ఆగాల్సిందే.

# 17 కార్పొరేషన్లకు చైర్మన్లు

మొదటి పేజీ తరువాయి

రేణుక, వైస్ చైర్మన్ – బత్తుల వెంకటేష్

- హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ – దూడెం వెంకట రమణ , వైస్ ఛైర్ పర్సన్ – జక్కని అనిత
- లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ – చరణ్ కౌశిక్
- తెలుగు అకాడమీ చైర్మన్ – ప్రొఫెసర్ వెంకట రమణ
- వాషర్‌మెన్ కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ – డాక్టర్ అజయ్ కుమార్, వైస్ చైర్మన్ – బంగారు బాబు
- గీత కార్మిక కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ – చంద్రశేఖర్ గౌడ్, వైస్ చైర్మన్ – కేసం నాగరాజు గౌడ్
- పెరిక కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ – గొంగరి వెంకటేశర్లు, వైస్ చైర్మన్ – బుద్ధం శ్రీనివాస్
- మేర కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ – సంగ వెంకట్ రాజం, వైస్ చైర్మన్ – ఎం. లక్ష్మీనారాయణ
- మున్నూరు కాపు కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ – బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ – అల్లం భాస్కర్
- పద్మశాలి కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ – గూడూరి శ్రీనివాస్
- వెలమ కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ – జువ్వాడి నర్సింగ్ రావు

# సువేందు అధికారి పీఏ దారుణ హత్య

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో దారుణం చోటుచేసుకుంది. బీజేపీ కీలక నేత సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) చంద్రనాథ్ రథ్ బుధవారం రాత్రి హత్యకు గురయ్యారు. ఉత్తర 24 పరగణాల జిల్లా మధ్యమ్‌గ్రామ్‌లో సువేందు పీఏ కారులో వెళ్తుండగా దుండగులు కాల్పులు జరపడంతో ఆయన మృతిచెందారు. చంద్రనాథ్‌తో పాటు ఉన్న బుద్ధదేవ్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఆయన్ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భవానీపూర్ నుంచి సువేందు అధికారి విజయం సాధించారు. మమతా బెనర్జీపై ఆయన గెలుపొందారు. సీఎం రేసులోనూ సువేందు ముందు వరుసలో ఉన్నారు. ఈ క్రమంలో ఆయన పీఏ హత్యకు గురికావడం చర్చనీయాంశమైంది.

# సీఎం విద్యాశాఖమంత్రి మన ఖర్మ

## ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని ప్రభుత్వం పట్టించుకోవటం.. ఫీజుల నియంత్రణ చట్టం ఈ నెలలోనే తేవాలి

### ఉచిత విద్య, వైద్యం మా పార్టీ విధానం.. మాట తప్పితే అమరవీరుల స్థూపం వద్ద రాళ్లతో కొట్టండి: టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, మే 6 (ఈవార్తలు): రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టటంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఘోరంగా ఫెయిల్ అయ్యిందంటూ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత ఆరోపించారు. ఫీజుల దోపిడీ నియంత్రణకు ఈ నెలలోనే చట్టం తేవాలని ఆమె డిమాండ్ చేశారు. హైదరాబాద్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య – ఫీజుల నియంత్రణ అనే అంశంపై సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం లో ఆమె పాల్గొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో అవినీతి పై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని తుంగలో తొక్కే కుట్రలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని నియంత్రించాల్సిన ముఖ్యమంత్రే ప్రైవేట్ విద్య సంస్థల ప్రారంభోత్సవాలకు వెళ్తూ వారిని ఎంకరేజ్ చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రే మన విద్యాశాఖ మంత్రి కావటం ఖర్మ అని ఆవేదన వ్యక్తం చేశారు.



#### ఈనెలలోనే ఫీజు నియంత్రణ చట్టం తేవాలి

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని ఎట్టి పరిస్థితుల్లో అరికట్టాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఫీజు నియంత్రణ కోసం తక్షణమే చట్టం చేయాల్సిందేనని అన్నారు. ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా ఫీజు పెంపు లేకుండా జీవో జారీ చేయాలన్నారు. ఫీజుల పెంపు కారణంగా తల్లితండ్రులకు మే నెల పీడకల మాదిరిగా తయారైందన్నారు. తెలంగాణలో విద్య, వైద్యం కోసమే 60 నుంచి 70 శాతం వరకు వారి ఆదాయాన్ని ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తమ పిల్లలను బాగా చదివించాలన్న తల్లితండ్రుల వీక్ నెస్ ను ఆసరాగా చేసుకొని ప్రైవేట్ సంస్థలు అడ్డగోలుగా ఫీజులు పెంచుతున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రతి ప్రైవేట్ స్కూల్ లో దాదాపు 50 నుంచి 120 శాతం వరకు ఫీజులు పెంచుతున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. త్వరలోనే తమతో కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేస్తామని చెప్పారు. తాము కొత్తగా ఏమీ అడగటం లేదని...రేవంత్ రెడ్డి సర్కార్ గతంలో ఇచ్చిన హామీలనే అడుగుతున్నామన్నారు.

#### ఫీజు రీయింబర్స్ మెంట్ ను బొందపెట్టే జీవో నం.7

ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టకపోగా.. ఫీజు రీయింబర్స్ మెంట్ ను కూడా బొందపెట్టే కుట్ర ఈ ప్రభుత్వం చేస్తోందని కవిత మండిపడ్డారు. ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఎంఎస్-7 జీవో తో ఫీజు రీయింబర్స్ మెంట్ కు మంగళం పాడే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పిల్లల అకౌంట్ లో ఫీజు రీయింబర్స్ మెంట్ వేస్తామంటూ జీవో లో పేర్కొన్నారని కవిత చెప్పారు. ఫీజు అకౌంట్ లో వేయకపోయిన సరే పిల్లల తల్లితండ్రులు ఉద్యమం చేయరన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పనిచేస్తుందన్నారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలన్నీ కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తెచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెండింగ్ లో ఉన్న రూ. 11,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. బకాయిలు చెల్లించకపోవటంతో కాలేజ్ లు మాతపడుతున్నా యన్నారు. పైగా చాలా మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించకపోతే అధికంగా నష్టపోయేది ఆడపిల్లలేనని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. చదువుల భారం ఎక్కువైతే కొడుకుల కంటే ముందు కూతుళ్లనే చదువు మాన్పించే పరిస్థితి వస్తుందన్నారు. ఈ విధంగా ప్రభుత్వం ఆడబిడ్డల భవిష్యత్ ను అంధకారంలోకి నెట్టేస్తుందన్నారు.

#### హెచ్ పీఎస్ లో అవినీతి చర్యలేవీ?

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్ పీఎస్) లో అడ్డగోలు అవినీతి జరుగుతోందని కవిత అన్నారు. ఈ అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో కొనసాగుతున్న హెచ్ పీఎస్ ఈ ఏడాది 120 శాతం ఫీజు పెంచిందని చెప్పారు. ప్రభుత్వ స్థలంలో కొనసాగే స్కూల్లోనే ఈ పరిస్థితి ఉంటే...చైతన్య, నారాయణ లాంటి స్కూళ్లలో పరిస్థితి ఎలా ఉంటుందని ప్రశ్నించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో ఒకే వ్యక్తి గత 14 ఏళ్లుగా అదే పదవిలో కొనసాగుతూ, కొత్తగా వచ్చేవారికి అవినీతి పాఠాలు నేర్పుతున్నారన్నారు. సత్య నాదెళ్ల వంటి పూర్వ విద్యార్థులు ఇచ్చిన విరాళాలకు సంబంధించి ఎలాంటి లెక్క పత్రం లేని పరిస్థితి ఉందన్నారు. దీనికి తోడు ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితులైన కొందరు ఏకంగా 30 ఎకరాల క్యాంపస్ భూమిని కబ్జా చేసే పనిలో ఉన్నారన్నారు. హెచ్‌పీఎస్ పనితీరుపై సమగ్ర సమీక్ష జరిపి, తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

#### రాళ్లతో కొట్టండి

విద్య, వైద్యం కోసమే తెలంగాణలో ప్రతి కుటుంబం 70 శాతం ఖర్చు చేసే పరిస్థితి ఉందని కవిత అన్నారు. 1200 మంది అమరుల ప్రాణ త్యాగం చేసి...ఎంతో మంది విద్యార్థులు లాఠీ దెబ్బలు తిని రాష్ట్రాన్ని సాధించారని కవిత గుర్తు చేశారు. సాధించుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఒక సంవేదనతో పాలన చేయాల్సి ఉండేనని చెప్పారు. కానీ ఆ పని జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు నియంత్రణ కోసం తిరుపతి రావు కమిషన్ వేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం...ఆ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ పై ఒక్క అడుగు ముందుకు వేయలేదన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం అందించడాన్ని ఒక సామాజిక బాధ్యతగా భావిస్తే వాటిని ఉచితంగా అందించడం సాధ్యమేనని చెప్పారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ బాధ్యత నుండి తప్పుకుని ప్రజలను వారి కర్మకు వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రక్షణ సేన (రసా) అధికారంలోకి వస్తే ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో కూడా పేదలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తామని మరోసారి తేల్చి చెప్పారు. తాను ఇచ్చిన మాటను తప్పితే అమరుల స్థూపం స్తంభానికి కట్టేసి రాళ్లతో కొట్టాలన్నారు.


మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.




## 18 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టాం

**త్వరలో మల్టీపర్పస్ ఏఎన్ఎంలు, నర్సింగ్ ఆఫీసర్ల ఫలితాలు**

**విద్యా, వైద్య, మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం**

**నారాయణఖేడ్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ**

నారాయణఖేడ్, మే 6 (ఈవార్తలు): వైద్యారోగ్యశాఖలో 18 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో నారాయణఖేడ్‌లో నిర్వహించిన 99 రోజుల కార్యాచరణ అమలు కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల కార్యకరణ కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని బాలసదనంలో స్థానిక శాసనసభ్యుడు డాక్టర్ సంజీవరెడ్డి గారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో సుమారు 18 వేల ఉద్యోగాల భర్తీని చేపట్టామన్నారు. త్వరలో మల్టీపర్పస్ ఏఎన్ఎం, నర్సింగ్ ఆఫీసర్ల ఉద్యోగ ఫలితాలను వెల్లడిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో విద్యా, వైద్య, మహిళా సాధికారత, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా, శిశు , వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా బాల సదనాలను, అంగన్వాడీలను కాపాడుకునే గురుతర బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు . రాష్ట్రంలో అంగన్వాడీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వ, సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు, 3 నుండి 6 ఏండ్ల పిల్లలకు ఒక పూట సంపూర్ణ భోజనం, ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలకు టేక్ హోమ్ రేషన్ అందించడం, మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల పిల్లలకి పూర్వ ప్రాథమిక విద్య అందించడంతోపాటు పోషకాహారం, ఆరోగ్యం, ప్రీ-స్కూలు, రోగ నిరోధకత, రిఫరల్ సేవలు, ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాలలో ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు, సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తల సేవలను అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వీరి సేవలను మంత్రి కొనియాడారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న బాలసదనం బాలికలతో మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలసదనంలో తక్షణమే ఆర్వో ప్లాంట్ ని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు , వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ వారోత్సవాలలో జిల్లాలో చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ శుభ్రత, 18 సంవత్సరాల పైబడిన సిసిఐ పిల్లలను గుర్తించడం, ఆరోగ్య శిబిరాలు నిర్వహించుట, అత్యవసర సర్టిఫికెట్లు ఆరోగ్య కార్డుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, సంస్థల నుండి పిల్లలను బయటికి డిశ్చార్జ్ చేసి తిరిగి వారికి పునరావాస కల్పించుట మరియు ఫాలో అప్ ప్రక్రియ, రెసిడెన్షియల్ స్కూల్స్ లో చేర్పు ప్రక్రియ ఇలాంటి అంశాలను జరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్, మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్, సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, మున్సిపల్ కమిషనర్ ప్రశాంత్, సీడీపీవో సుజాత, ఆశ్రమ నిర్వాహకురాలు విజయ కుమారి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రుణమాఫీని నాలుగు ముక్కలు చేశారు

**కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఫైర్**

హైదరాబాద్, మే 6 (ఈవార్తలు): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. రైతుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనల మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని ఆమె అన్నారు. కేటీఆర్ తన అహంకారపూరిత వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రుణమాఫీని నాలుగు విడతలుగా విభజించి రైతులను ఇబ్బంది పెట్టారని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు.



## పసికందును రూ.1.50 లక్షలకు అమ్మేసిన నర్సు

**మెదక్‌లో దారుణం.. బిడ్డ చనిపోయిందని తల్లిని నమ్మించి మోసం**

మెదక్, మే 6 (ఈవార్తలు): మెదక్ జిల్లాలో అత్యంత దారుణమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. పుట్టిన పసికందు చనిపోయిందని తల్లిని నమ్మించిన ఓ నర్సు, ఆ శిశువును రూ.1.50 లక్షలకు విక్రయించింది. ఈ అమానవీయ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పాపన్నపేట మండలం లక్ష్మీనగర్ తండాకు చెందిన నస్రా ఫాతిమా సికింద్రాబాద్‌లోని మౌలాలిలో నివసిస్తోంది. ఏడు నెలల గర్భిణిగా ఉన్న ఆమె, ఇటీవల తన అత్తగారింటికి వెళ్లేందుకు మెదక్‌కు వచ్చింది. బస్టాండ్‌లో ఆమె చేతిలోని చిప్స్ ప్యాకెట్‌ను చూసిన కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనతో భయపడిపోయిన ఆమెను స్నేహితురాలు స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు శస్త్రచికిత్స చేయగా, ఫాతిమా ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే, అదే ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న అక్తరీ బేగం, పుట్టిన పాప చనిపోయిందని ఫాతిమాను నమ్మించింది. నర్సు మాటలు నిజమని భావించిన ఫాతిమా, తీవ్ర దుఃఖంతో మూడు రోజుల తర్వాత ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లింది. అయితే, ఐదు రోజుల తర్వాత ఓ వ్యక్తి ద్వారా తన పాప బతికే ఉందని ఫాతిమాకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించి, నర్సు అక్తరీ బేగంపై ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## క్రిశాంక్ కు బెయిల్ మంజూరు

హైదరాబాద్, మే 6 (ఈవార్తలు): బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాల నేపథ్యంలో నమోదైన కేసుల్లో ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. కేసు వివరాల్లోకి వెళితే... కూకట్‌పల్లిలో కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజేంద్ర కుమార్ నివాసం వద్ద గొడవ పడ్డారనే ఆరోపణలపై పోలీసులు క్రిశాంక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి అదనంగా, 2024లో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక పాత కేసులో కూడా పోలీసులు పీటీ వారెంట్ జారీ చేసి ఆయనను మేడ్చల్ కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెట్టడం, అధికారులను దూషించడం వంటి అంశాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్న క్రిశాంక్, వీటిపై బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో విచారణ సందర్భంగా, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సెలవు రోజుల్లో కూడా పీటీ వారెంట్లు జారీ చేస్తూ తనను వేధిస్తున్నారని క్రిశాంక్ తరపు న్యాయవాదులు వాదించారు.

## మెట్రో-2కు అనుమతులివ్వండి

న్యూఢిల్లీ: కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఇరువురు నేతలు సుమారు అరగంట పాటు సమావేశమై, వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మెట్రో రెండో దశకు అవసరమైన అనుమతులను మంజూరు చేయాలని కేంద్రమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ మెట్రో రైలును రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోనున్నట్లు కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మెట్రో రెండో దశ డీపీఆర్‌ను వెంటనే ఆమోదించాలని కోరారు. శంషాబాద్ విమానాశ్రయం – ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్-3 కింద చేపట్టాలని ముఖ్యమంత్రి కోరారు.


నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE: Price for 5 Lines – Rs.450 (for each extra line – Rs.90)

COLOUR: Price for 5 Lines – Rs.500 (for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com



# కాంగ్రెస్ అసలు రంగు బయటపడింది

**విజయ్‌కి మద్దతుపై డీఎంకే నేత ఆగ్రహం**



చెన్నై: ఇన్నాళ్లు తమతో ఉండి, ఇప్పుడు టీవీకే అధినేత విజయ్‌తో కలవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ అసలు రంగు బయటపడిందని డీఎంకే కోశాధికారి టీఆర్ బాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే మరో 10 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ టీవీకేకు మద్దతు పలికింది. అయినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మరో ఆరుగురు ఎమ్మెల్యేలు తక్కువపడుతున్నారు. టీవీకేకు కాంగ్రెస్ మద్దతు పలకడంపై డీఎంకే గుర్రుగా ఉంది. తమిళనాడు ప్రజలు తమ కూటమికి ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ పార్టీ అవమానిస్తోందని మండిపడ్డారు. డీఎంకే కూటమికి కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ క్లిష్టపరిస్థితులను, సంక్షోభాలను ఎదుర్కొన్నప్పుడల్లా మిత్రపక్షంగా డీఎంకే అండగా నిలిచిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి సహకరించినందుకు తాము ఇప్పుడు భారీ మూల్యం చెల్లించుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు ఇప్పుడు అసలు విషయం బోధపడిందని టీఆర్ బాలు అన్నారు. కాంగ్రెస్, డీఎంకే మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న బంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ సహా ఇతర కాంగ్రెస్ నాయకులతో డీఎంకేకు ఉన్న సంబంధాలను ఆయన ప్రస్తావించారు. డీఎంకే అధినేత స్టాలిన్ రాజకీయంగా, వ్యక్తిగతంగా రాహుల్ గాంధీకి అనునిత్యం మద్దతుగా నిలబడ్డారని అన్నారు. 2019 లోక్ సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకత్వం కూడా రాహుల్ గాంధీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించడానికి వెనుకాడిందని, అలాంటి సమయంలో స్టాలిన్ ఆయన పేరును ప్రతిపాదించారని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, కాంగ్రెస్ కలిసి పోటీ చేశాయని, కానీ ఆ పార్టీ మాత్రం నిస్సిగ్గుగా ఎమ్మెల్యేలను శత్రు శిబిరానికి పంపించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంకే నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడుతుందని నమ్మి ఓటేసిన వారిని కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం కాంగ్రెస్ కూడా బీజేపీ లాంటి ఎత్తుగడలనే అనుసరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తనకు నచ్చిన పార్టీకి మద్దతు ఇచ్చే హక్కు ఉన్నదని, కానీ ప్రజాతీర్పును అవమానించకూడదని అన్నారు. ఇలాంటి ఎదురుదెబ్బలు, ద్రోహాలు డీఎంకేకు కొత్త కాదని అన్నారు. కాలమే అనింటికి సమాధానం చెబుతుందని టీఆర్ బాలు అన్నారు.



## ‘ప్రాజెక్ట్ ఫ్రీడమ్’ను నిలిపివేసిన ట్రంప్

**ఇరాన్‌తో చర్చల్లో పురోగతితోనే నిర్ణయం**

వాషింగ్టన్: ఇరాన్‌తో చర్చల్లో పురోగతి సాధించామని, పాకిస్థాన్ వంటి దేశాల అభ్యర్థన మేరకు కీలక నిర్ణయం తీసుకున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. హర్మూజ్ జలసంధిలో అమెరికా నేతృత్వంలో చేపట్టిన ‘ప్రాజెక్ట్ ఫ్రీడమ్’ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆయన బుధవారం ప్రకటించారు. అయితే, ఇరాన్‌పై విధించిన దిగ్బంధనం మాత్రం పూర్తిస్థాయిలో కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ట్రంప్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. “ఇరాన్‌తో తుది ఒప్పందం దిశగా గణనీయమైన పురోగతి సాధించాం. పాకిస్థాన్, ఇతర దేశాల అభ్యర్థన మేరకు ‘ప్రాజెక్ట్ ఫ్రీడమ్’ కింద నౌకల కదలికలను కొంతకాలం నిలిపివేయాలని నిర్ణయించాం. ఒప్పందం ఖరారవుతుందో లేదో చూసేందుకే ఈ విరామం” అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్, ఇటీవలి సైనిక చర్యల్లో ఇరాన్ నావికా, వైమానిక దళాలు పూర్తిగా దెబ్బతిన్నాయని వ్యాఖ్యానించారు. వారి సైనిక శక్తిని సర్వనాశనం చేశామని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోందని, అందుకే ఇరాన్ ఒప్పందం కోసం ముందుకు వస్తోందని ఆయన అన్నారు. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హర్మూజ్ జలసంధి తమ నియంత్రణలోనే ఉందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా స్పష్టం చేశారు. ఇరాన్‌తో చర్చల ఫలితం వెలువడేంత వరకు ఈ తాత్కాలిక విరామం కొనసాగనుంది.

## ఐప్యాక్‌తో బంధానికి అఖిలేశ్ గుడ్‌బై

లక్నో: తమిళనాడులో డీఎంకే కూటమి, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం చవిచూశాయి. ఈ రెండు పార్టీలకు ఐ–ప్యాక్ పనిచేసింది. అయితే ఈ ఓటమి తర్వాత రెండు రోజులకే ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ కీలక నిర్ణయం ప్రకటించారు. ఐ–ప్యాక్‌తో సంబంధాలు తెంచుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అయితే, ఇందుకు నిధుల కొరత కారణమని ఆయన తెలిపారు. వచ్చే సంవత్సరం ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఐ–ప్యాక్‌తో గత సంవత్సరం ఒప్పందం కుదుర్చుకున్నామని అఖిలేశ్ యాదవ్ తెలిపారు. ఐ–ప్యాక్ టీమ్ తమతో కొన్ని నెలలు పని చేసిందని, కానీ నిధుల కొరత కారణంగా దానిని కొనసాగించలేకపోతున్నామని వెల్లడించారు. బెంగాల్‌లో టీఎంసీ, తమిళనాడులో డీఎంకే ఓటమి నేపథ్యంలో ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఐప్యాక్ ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేశారని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించారు. “మా వద్ద నిధులు లేవు. మీరు (మీడియా) మాకు నిధులు ఇస్తే మరో కంపెనీని ఎన్నికల కోసం నియమించుకుంటాం” అని అఖిలేష్ సరదాగా అన్నారు. కానీ, ఐప్యాక్ పని చేసిన రెండు పార్టీలు ఓడిపోయిన అనంతరం అఖిలేష్ యాదవ్ నుంచి ఈ ప్రకటన రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల తీరును అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. దీనిని సుప్రీంకోర్టు వెంటనే సుమోటోగా స్వీకరించాలని కోరారు. ఓట్ల లెక్కింపు వీడియో రికార్డింగును ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. బెంగాల్‌లో చోటు చేసుకున్న పరిణామాలు వచ్చే సంవత్సరం ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్‌లో పునరావృతమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ నిర్ణయాన్ని గౌరవిస్తాం: కనిమొళి



తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల ఫలితాల తర్వాత డీఎంకే కూటమి నుంచి కాంగ్రెస్ బయటకు వచ్చి, విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి మద్దతు ప్రకటించడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామాలపై డీఎంకే కనిమొళి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీకైనా తమకు నచ్చిన నిర్ణయం తీసుకునే హక్కు ఉంటుందని కనిమొళి పేర్కొన్నారు. డీఎంకే–కాంగ్రెస్ కలిసి చాలా ఎన్నికల్లో పనిచేశాయని, ఈసారి ఓటమి చవిచూశామని ఆమె తెలిపారు. కాంగ్రెస్ తన సొంత నిర్ణయం తీసుకుందని, దానిని తాము గౌరవిస్తామని చెప్పారు. టీవీకే తనను తాను సెక్యులర్ పార్టీగా చెప్పుకోవడంపై స్పందిస్తూ... తమిళనాడులో మరో సెక్యులర్ పార్టీ రావడాన్ని తాము ఆహ్వానిస్తామన్నారు. దీనివల్ల డీఎంకేకు ఎలాంటి భయం లేదని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో డీఎంకే కేవలం 59 స్థానాలకు పరిమితం కావడం, స్వయంగా స్టాలిన్ కొలత్తూరులో ఓడిపోవడంపై పార్టీ కచ్చితంగా విశ్లేషణ చేసుకుంటుందని చెప్పారు. ప్రజలు మార్పును కోరుకున్నారని ఆమె అంగీకరించారు. ఎన్నికల్లో ఘనవిజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్‌కు ఆమె అభినందనలు తెలిపారు. ప్రజలు ఆశించిన రీతిలో టీవీకే పాలన అందిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

## సీఎం పదవికి హిమంత రాజీనామా

**మే 11న కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం**

గౌహతి: అసోం రాజకీయాల్లో నూతన ప్రభుత్వ ఏర్పాటు దిశగా కీలక అడుగు పడింది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తన పదవికి రాజీనామా చేశారు. అసోం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తన కేబినెట్ సహచరులతో కలిసి గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను కలిశారు. తన రాజీనామా లేఖను గవర్నర్‌కు అందజేయగా, ఆయన దానిని ఆమోదించారు. అయితే, కొత్త ప్రభుత్వం కొలువుదీరే వరకు తాత్కాలిక ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించాలని గవర్నర్ ఆయనను కోరారు. 126 స్థానాలున్న అసోం అసెంబ్లీలో బీజేపీ కూటమి ఏకంగా 102 స్థానాలను కైవసం చేసుకుని రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. రాజీనామా అనంతరం లోక్ భవన్ వెలుపల మీడియాతో మాట్లాడిన హిమంత బిశ్వ శర్మ, ఈ చారిత్రాత్మక విజయం తర్వాత కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం మే 11 తర్వాత ఉంటుందని వెల్లడించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. కేంద్ర పరిశీలకుల సమక్షంలో త్వరలోనే జరగబోయే బీజేపీ శాసనసభ పక్ష సమావేశంలో కొత్త ముఖ్యమంత్రిని అధికారికంగా ఎంపిక చేయనున్నారు. అసోంలో వరుసగా మూడోసారి బీజేపీ అధికారాన్ని చేపట్టబోతుండటంతో అటు పార్టీ వర్గాల్లో, ఇటు ప్రజల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## మోదీ, అమిత్ షా వ్యూహాలు భేష్

**కాంగ్రెస్ ఆత్మపరిశీలను చేసుకోవాలి: శశి థరూర్**

తిరువనంతపురం: కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ తనదైన శైలిలో మరోసారి ముక్కుసూటిగా స్పందిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాల ఎన్నికల వ్యూహాలను ప్రశంసించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో తమ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కేరళలో యూడీఎఫ్ విజయం సాధించినప్పటికీ, మిగిలిన రాష్ట్రాల్లో పార్టీ పనితీరు నిరాశాజనకంగా ఉందని గుర్తు చేస్తూ, బీజేపీ నేతల నిర్వహణా నైపుణ్యాల నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉందని వ్యాఖ్యానించారు.

# స్టాలిన్‌తో రజనీకాంత్ భేటీ

**ఓటమి వేళ సంఘీభావం.. అండగా ఉంటానని స్టాలిన్‌కు హామీ**



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. డీఎంకే ఓటమి నేపథ్యంలో ఆ పార్టీ అధినేత ఎంకే స్టాలిన్‌తో సూపర్‌స్టార్ రజనీకాంత్ ఇవాళ చెన్నైలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ప్రభుత్వ ఏర్పాటుపై తీవ్రమైన రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్న తరుణంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల్లో డీఎంకే ఓటమి పాలైన నేపథ్యంలో స్టాలిన్‌కు సంఘీభావం తెలిపేందుకే రజనీకాంత్ ఆయన్ను కలిశారని సమాచారం. ఈ కష్టకాలంలో తాను ఆయనకు అండగా ఉంటానని రజనీ భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. కొంతసేపు జరిగిన ఈ భేటీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. డీఎంకే కూటమిలోని వీసీకే, వామపక్షాల నేతలు కూడా పార్టీ ప్రధాన కార్యాలయం ‘అన్నా అరివాలయం’లో స్టాలిన్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 234 స్థానాలకు గాను స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కేవలం 59 సీట్లకే పరిమితమై అధికారాన్ని కోల్పోయింది. నూతనంగా రాజకీయాల్లోకి వచ్చిన నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) 108 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 సీట్ల మెజారిటీకి చేరువలో ఆగిపోయింది. దీంతో టీవీకే అధినేత విజయ్ ప్రభుత్వ ఏర్పాటు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఐదు సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ షరతులతో కూడిన మద్దతు ప్రకటించగా, సీపీఐ, సీపీఎం, వీసీకే వంటి పార్టీలతో కూడా టీవీకే సంప్రదింపులు జరుపుతోంది. ఈ రాజకీయ పరిణామాల మధ్య తమిళనాడు అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న గవర్నర్ ఆర్.వి. అర్లేకర్ చెన్నైకి చేరుకోవడంతో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ మరింత పెరిగింది. రాబోయే రోజుల్లో రాష్ట్రం సంకీర్ణ రాజకీయాల శకంలోకి అడుగుపెట్టవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తక్కువ జీతమైనా ఇండియాకు వచ్చేస్తా

**అమెరికా టెక్కీ ఆవేదన**

న్యూయార్క్: అమెరికాలో అధిక జీతంతో కూడిన ఉద్యోగం ఎంతోమంది కల. కానీ, ఆ కల వెనుక ఉండే ఒత్తిడి, ఆందోళన జీవితాన్నే నరకంగా మార్చేస్తాయని ఓ ఎన్ఆర్ఐ టెక్కీ అనుభవం చెబుతోంది. గత 8 ఏళ్లుగా అమెరికాలో ఉంటున్న 36 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అక్కడి ఉద్యోగంలో తీవ్రమైన ఒత్తిడి, అనారోగ్య సమస్యలు తట్టుకోలేక ఇండియాకు తిరిగి వచ్చేయాలని భావిస్తున్నట్లు సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ విషయంలో ఏం చేయాలో తెలియక నెటిజన్ల సలహా కోరారు. సుమారు 7 ఏళ్ల అనుభవం ఉన్న ఈ టెక్కీ తన పోస్టులో పలు కీలక విషయాలు వెల్లడించారు. “ప్రారంభంలో అంతా బాగానే ఉన్నా, గత ఏడాది నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. టాక్సిక్ మేనేజ్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై పనిచేయాలనే తీవ్రమైన ఒత్తిడి, ఆఫీస్ రాజకీయాలు నన్ను కుంగదీస్తున్నాయి. ప్రస్తుతం అమెరికాలో 5 ఏళ్లకు పైగా అనుభవం ఉంది” అని ఆయన పేర్కొన్నారు. జీవితంలో తనకు సరైన సపోర్ట్ సిస్టమ్ లేదని, ఒంటరిగా ఈ ఒత్తిడిని ఇక భరించలేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒత్తిడి తన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన తెలిపారు. “గత ఏడాది నుంచి హై బీపీ, డిప్రెషన్ కోసం మందులు వాడుతున్నాను. ప్రతి ఉదయం నిద్రలేవగానే స్ట్రోక్ వస్తుందేమోనన్న భయం వేస్తోంది. రోజురోజుకీ టెక్నాలజీ రంగంపైనే విరక్తి కలుగుతోంది” అని తన ఆరోగ్య పరిస్థితిని వివరించారు. ఈ నేపథ్యంలో ఇండియాకు తిరిగి వచ్చి, తక్కువ జీతం అయినా సరే ప్రశాంతమైన జీవితాన్నిచ్చే ఉద్యోగం చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. “భవిష్యత్తుపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో తెలియడం లేదు. పూర్తిగా నిస్సహాయ స్థితిలో ఉన్నాను. దయచేసి మీ అభిప్రాయాలు పంచుకోండి” అని ఆయన కోరారు. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు ఆయనకు మద్దతుగా నిలిచారు. మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. “కుటుంబానికి, స్నేహితులకు దగ్గరగా ఉండటం కోసం తిరిగి రావడం మంచి నిర్ణయమే. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దు” అని ఒకరు కామెంట్ చేశారు. “జీతం తక్కువైనా ఒత్తిడి లేని ఉద్యోగంలో చేరండి. ఇప్పటివరకు మీరు చాలా కష్టపడ్డారు. ఇక మీ ఆరోగ్యంపై దృష్టి పెట్టండి” అని మరో యూజర్ సలహా ఇచ్చారు. “మీ మానసిక ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదు” అంటూ చాలామంది ఆయనకు ధైర్యం చెప్పారు.

# అమెరికా నౌకలపై డాల్ఫిన్లతో దాడి?

**ఇరాన్ కుట్ర చేసిందన్న యూఎస్**

వాషింగ్టన్: హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలకు ఇరాన్ మైన్లతో అంతరాయం కలిగించవచ్చన్న ఆందోళనల మధ్య, అమెరికా నౌకాదళాన్ని ఎదుర్కొనేందుకు టెహ్రాన్ “కామికేజ్ డాల్ఫిన్లను” రంగంలోకి దించనుందంటూ వస్తున్న వార్తలపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ ఊహాగానాలపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పందించారు. ఇరాన్ వద్ద అటువంటి డాల్ఫిన్ సైన్యం లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, అమెరికా వద్ద ఉన్నాయా? అనే ప్రశ్నకు మాత్రం సమాధానం దాటవేశారు. “మా వద్ద కామికేజ్ డాల్ఫిన్లు ఉన్నాయో? లేదో? నేను ధ్రువీకరించలేను. అలా అని ఖండించలేను. కానీ, ఇరాన్ వద్ద మాత్రం అవి లేవని కచ్చితంగా చెప్పగలను” అని ఒక మీడియా సమావేశంలో హెగ్సెత్ అన్నారు. ఏప్రిల్ 30న వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రచురించిన ఒక కథనంతో ఈ చర్చ మొదలైంది. అమెరికా యుద్ధ నౌకలపై దాడి చేసేందుకు ఇరాన్ “మైన్లు మోసుకెళ్లే డాల్ఫిన్లను” ఉపయోగించవచ్చని ఆ కథనం పేర్కొంది. మరోవైపు అమెరికా నౌకాదళం దశాబ్దాలుగా డాల్ఫిన్లను సైనిక అవసరాలకు వినియోగిస్తోంది. యూఎస్ నేవీకి చెందిన “మెరైన్ మమ్మల్ ప్రోగ్రామ్” కింద బాటిల్‌నోస్ డాల్ఫిన్లు, కాలిఫోర్నియా సీ లయన్‌లకు శిక్షణ ఇస్తున్నారు. అయితే, ఇవి ఇరాన్ వాడొచ్చని ప్రచారంలో ఉన్న “కామికేజ్ డాల్ఫిన్ల” వంటివి కావు. అమెరికా డాల్ఫిన్లు కేవలం సముద్ర గర్భంలో మైన్లను గుర్తించి, వాటి లొకేషన్‌ను మార్క్ చేస్తాయి. అంతేగాని, ఆత్మాహుతి దాడులు చేసి ప్రాణాలు త్యాగం చేయవు. “డాల్ఫిన్ల సోనార్ వ్యవస్థ ముందు సైన్స్‌కు తెలిసిన ఏ టెక్నాలజీ సరిపోదు. నీటి అడుగున పనిచేసే డ్రోన్‌లు కూడా వీటికి సాటిరావు” అని ఈ ప్రోగ్రామ్ వెబ్‌సైట్ పేర్కొంది. గతంలో రష్యా తమ నౌకాశ్రయాల భద్రతకు డాల్ఫిన్లను వాడింది. 2000 సంవత్సరంలో ఇరాన్ కూడా కొన్ని డాల్ఫిన్లను కొనుగోలు చేసింది. అయితే, అవి ఇప్పుడు వయసు పైబడటం వల్ల ఉపయోగంలో ఉండే అవకాశం లేదని, ప్రస్తుతం టెహ్రాన్ వద్ద క్రియాశీల డాల్ఫిన్ ప్రోగ్రామ్ ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతానికి హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నాల్లో అమెరికా డాల్ఫిన్లను ఉపయోగించడం లేదని సీఎన్ఎన్ కథనం పేర్కొంది.

# బీఎస్ఎఫ్ హెడ్‌క్వార్టర్స్ సమీపంలో పేలుడు

**జలంధర్‌లోని బీఎస్ఎఫ్ చౌక్ ప్రాంతంలో ఘటన**




జలంధర్: పంజాబ్‌లోని జలంధర్‌లో మంగళవారం తీవ్ర కలకలం రేగింది. బీఎస్ఎఫ్ చౌక్ ప్రాంతంలో, సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) హెడ్‌క్వార్టర్స్‌కు సమీపంలో పార్క్ చేసి ఉన్న ఓ స్కూటర్‌లో అకస్మాత్తుగా పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. ఈ ఘటనతో రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. ఓ పెద్ద శబ్దం వచ్చిన వెంటనే స్కూటర్‌కు మంటలు అంటుకున్నాయని, దీంతో సమీపంలోని ప్రజలు భయంతో పరుగులు తీశారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై జలంధర్ పోలీస్ కమిషనర్ ధన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ ఇప్పుడే ఒక నిర్ధారణకు రాలేమని తెలిపారు. “ప్రాథమికంగా చూస్తే, ఇక్కడ పార్క్ చేసిన స్కూటర్‌కు నిప్పంటుకుంది. క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలిస్తున్నాం” అని ఆమె వివరించారు. స్కూటర్ డ్రైవర్‌తో పాటు మరొకరిని విచారిస్తున్నామని, ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని ఆమె వెల్లడించారు. స్కూటర్ నడిపిన వ్యక్తిని 22 ఏళ్ల గురుప్రీత్ సింగ్‌గా గుర్తించారు. అతడు డెలివరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడని, రోజూ మాదిరిగానే పార్శిల్ ఇవ్వడానికి వచ్చి స్కూటర్ వద్దకు వెళ్లగా అది అకస్మాత్తుగా మంటల్లో చిక్కుకుందని అతడి బంధువు ఒకరు తెలిపారు. ఈ ఘటనపై పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్ స్పందిస్తూ అధికార ఆప్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, సున్నితమైన సరిహద్దు రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరగడం జాతీయ భద్రతకు ముప్పని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫోరెన్సిక్ బృందంతో పాటు, బాంబ్, డాగ్ స్క్వాడ్‌లు కూడా రంగంలోకి దిగి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాయని పోలీసులు తెలిపారు.

## అమెరికాకు చైనా చీమల భయం

వాషింగ్టన్: అమెరికాలో వేగంగా విస్తరిస్తున్న చైనాకు చెందిన ‘ఏషియన్ నీడిల్ ఆంట్’ అనే ప్రమాదకరమైన చీమల జాతి గురించి ఆరోగ్య నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. చైనా మూలాలు కలిగిన ఈ ‘ఏషియన్ నీడిల్ ఆంట్స్’ ప్రస్తుతం అమెరికాలోని టెక్సాస్, ఫ్లోరిడా, న్యూయార్క్, పెన్సిల్వేనియా సహా సుమారు 20 రాష్ట్రాలకు విస్తరించాయి. ఐదో వంతు అంగుళం పరిమాణంలో, ముదురు గోధుమ లేదా నలుపు రంగులో ఉండే ఈ చీమలు అమెరికాలో దశాబ్దాల క్రితమే కనిపించినప్పటికీ, గత కొన్నేళ్లుగా వీటి జనాభా అసాధారణంగా పెరిగింది. సాధారణ చీమల మాదిరిగా ఇవి పుట్టలు పెట్టకుండా, నేల రాలిన ఆకులు, కుళ్ళిన మొద్దులు, అటవీ ప్రాంతాల్లో నివసిస్తాయి. దీనివల్ల మనుషులు తెలియకుండానే వీటిపై కాలు వేయడం లేదా తాకడం వంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ చీమల కుట్టు అత్యంత వేదనాభరితంగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక పదునైన సూదిని శరీరంలోకి నేరుగా గుచ్చితే ఎంతటి తీవ్రమైన నొప్పి కలుగుతుందో, ఈ చీమ కుడితే అంతటి నొప్పి ఉంటుందని కీటక శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ఈ నొప్పి కొన్ని గంటల పాటు బాధిస్తుంది. ముఖ్యంగా అలర్జీ ఉన్నవారిలో ఇది ‘అనాఫిలాక్సిస్’ వంటి ప్రాణాపాయ స్థితికి దారితీసే ప్రమాదం ఉంది. వీటి స్టింగర్ ఎంత బలంగా ఉంటుందంటే, బట్టల గుండా కూడా కుట్టగలదు. అయితే, ఈ చీమలు సహజంగా దుందుడుకు స్వభావం కలిగినవి కావని, తమకు ముప్పు పొంచి ఉందని భావించినప్పుడు మాత్రమే కుడతాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే తోటపని చేసేవారు లేదా బయట తిరిగే వారు గ్లోవ్స్ ధరించాలని, ఈ చీమలు కనిపిస్తే జాగ్రత్తగా అక్కడి నుండి తప్పుకోవాలని సూచిస్తున్నారు. వీటి వ్యాప్తిని అడ్డుకోవడం ఇప్పుడు దాదాపు అసాధ్యమని, అమెరికా పర్యావరణంలో ఇవి ఒక భాగమైపోయాయని అమెరికా వ్యవసాయ శాఖ అభిప్రాయపడింది.

## బెంగాల్ సీఎంగా సువేందు అధికారి?

**తన రాజకీయ గురువు మమత స్థానంలో బాధ్యతలు**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలుకానుంది. ఒకప్పటి తన రాజకీయ గురువైన మమతా బెనర్జీ స్థానంలో బీజేపీ నేత సువేందు అధికారి రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం శుక్రవారం కోల్‌కతాలో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో సువేందు అధికారిని శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య ఆయన పేరును ప్రతిపాదించనుండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారికంగా ప్రకటిస్తారని తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో బీజేపీ తరపున సువేందు అధికారి బలమైన అభ్యర్థిగా నిలిచారు. ఒకప్పుడు మమతా బెనర్జీ అధికారంలోకి రావడానికి కారణమైన నందిగ్రామ్‌లో ఆమెపై గెలిచి సంచలనం సృష్టించారు. తాజాగా ఆమె కంచుకోటగా భావించే భవానీపూర్‌లోనూ భారీ మెజారిటీతో విజయం సాధించి, పార్టీలో తిరుగులేని నేతగా ఆవిర్భవించారు. ఈ విజయాలే ఆయనను ముఖ్యమంత్రి పీఠం వైపు నడిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కేటీఆర్‌పై వ్యాఖ్యలు వెనక్కి తీసుకోండి: వసంత

జగిత్యాల, మే 6 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ బీజేపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడిన ఆమె, కేంద్ర సహాయ మంత్రి హోదాలో ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాల పేరుతో వ్యక్తిగత దూషణలకు దిగడం సరైంది కాదని, అలాంటి వ్యాఖ్యలు మంత్రి పదవికి అవమానకరమని అన్నారు. బీజేపీ క్రమశిక్షణ గల పార్టీ అని చెప్పుకుంటూ ఇలాంటి భాష ఉపయోగించడం సమంజసం కాదని విమర్శించారు. కరీంనగర్‌కు ఎవరు రావాలో చెప్పే హక్కు ఎవరికీ లేదని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ ఉందని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకు రాజకీయంగా సమాధానం ఇవ్వాలి తప్ప వ్యక్తిగత వ్యాఖ్యలు చేయకూడదన్నారు. అలాగే కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్ రావు, దేవేందర్ నాయక్, శీలం ప్రవీణ్, జున్ను రాజేందర్, గాజుల రాజేందర్, ఆనంద్ రావు, సింగరావు సుధాకర్, శీలం సురేందర్, తుమ్మ గంగాధర్, నీలి ప్రతాప్, ఆడేపు సత్యం, అనురాధ, కళ్యాణి, నవీన్, ఆరుముల్ల మానస, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



**ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి**

రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్ల పట్ల నిర్లక్ష్యం వీడి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామంలోని ఐకేపీ వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట చేతికొచ్చి 20 రోజులు గడిచినా, కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే 15 రోజుల క్రితం ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. రైతుల సమస్యల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రైతు డిక్లరేషన్ పేరుతో హామీలు ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం రైతులు పండించిన పంటను కొనుగోలు చేయలేని స్థితిలో ఉందని అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అయిల్నేని ఆనంద్ రావు, మోహన్, శ్రీపాల్, జలంధర్, రాజమల్లు, మల్లేశం, గంగాధర్, తిరుపతి, సత్తన్న, భాగ్య, మల్లయ్యతో పాటు రైతులు పాల్గొన్నారు.

# కేంద్ర నిబంధన వల్లే కొనుగోళ్లు ఆలస్యం: అడ్లూరి

ధర్మపురి, మే 6 (ఈవార్తలు): ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనల కారణంగా ఆలస్యం జరిగిందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని బుధవారం ధర్మపురి మార్కెట్ యార్డులో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆన్లైన్ విధానం, ట్రక్ షీట్లు, జీపీఆర్ఎస్ వంటి సాంకేతిక సమస్యల వల్ల కొనుగోళ్లు సుమారు 15 రోజులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయని వివరించారు. రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి నిబంధనలు సడలించి పాత విధానంలో కొనుగోళ్లు ప్రారంభించేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మార్కెట్ యార్డుల్లో ఉన్న వరి ధాన్యం, మక్కజొన్నలను వారం పది రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. అధికారులు సమన్వయం చేసుకుని కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, చిలుముల లక్ష్మణ్, వేముల రాజు, సొల్ల నరేష్, చీపురుశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.





## తిరుపతిలో సౌకర్యాలు అమోఘం

**దత్త ప్రచారకుడు లక్ష్మీ నారాయణ దత్త స్వామి**

తిరుపతి, మే 6 (ఈవార్తలు): ఏపీలోని పిఠాపురానికి చెందిన ప్రముఖ దత్త ఉపాసకుడు, దత్త ప్రచారకుడు లక్ష్మీనారాయణ దత్త స్వామి మంగళవారం ఉదయం ప్రోటోకాల్ దర్శనంలో శ్రీ వారిని దర్శించుకున్నారు. లక్ష్మీనారాయణ దత్త స్వామి వారు అలిపిరి మెట్ల మార్గం నుండి శ్రీవారి సన్నిధి వరకు నడుచుకుంటూ చేరుకున్నారు. ఈ సందర్భంగా దత్త స్వామి మాట్లాడుతూ తిరుమలలో చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో సాధారణ భక్తులకు అన్ని రకాల వసతులు, ఏర్పాట్లు చాలా సంతోషాన్ని కలిగించిందని తెలిపారు.

## విజయ్ గెలుపు దిగ్భ్రాంతికరం

హైదరాబాద్, మే 6 (ఈవార్తలు): తమిళనాడు రాజకీయాల్లో సంచలనం సృష్టించిన నటుడు విజయ్, ఆయన పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) ఘన విజయంపై లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాశ్ నారాయణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీ పెట్టిన రెండేళ్లకే ద్రవిడ దిగ్గజాలను పక్కకు నెట్టి విజయ్ ముఖ్యమంత్రి పీఠానికి చేరువ కావడం తాను ఊహించలేదని, ఈ ఫలితాలు తనను దిగ్భ్రాంతికి గురిచేశాయని అన్నారు. ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ మేరకు తన విశ్లేషణను పంచుకున్నారు. జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ... "నిజాయితీగా చెప్పాలంటే ఇది ఎవరూ ఊహించని ఫలితం. కమల్ హాసన్, రజినీకాంత్ వంటి ఎందరో సినీ నటులకు దక్కని రాజకీయ విజయం విజయ్‌కు దక్కింది. తమిళనాడులో 50 శాతం పట్టణీకరణ ఉంది, ఉన్నంతలో అది మంచి పరిపాలన అందిస్తున్న రాష్ట్రం. అయినా సరే, మంచి పాలన అందిస్తున్న స్టాలిన్ ఓడిపోయి, ప్రజలు విజయ్ వైపు మొగ్గు చూపారు" అని అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఆయన మరింత లోతుగా విశ్లేషించారు. "ప్రజలు, ముఖ్యంగా జన్‌జీ తరం యువత, తక్షణమే అద్భుతాలు జరగాలని ఆశిస్తున్నారు. 'ఒకే ఒక్కడు' సినిమాలో అర్జున్ ఒక్కరోజులో అన్నీ మార్చేసినట్టు, క్షణాల్లో మార్పు రావాలని కోరుకుంటున్నారు. ఈ ఆలోచనా విధానం చాలా ప్రమాదకరం. అభివృద్ధి అనేది ఒక నిరంతర ప్రక్రియ, దానికి సమయం పడుతుంది. మార్పును కోరుకోవడంలో తప్పు లేదు, కానీ అది తక్షణమే జరగాలనుకోవడం దేశానికి మంచిది కాదు" అని హెచ్చరించారు. స్టాలిన్ ఓటమి వెనుక కుట్రలు, వ్యూహాలు ఉండి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. "ప్రజలు మూడో కంటికి తెలియకుండా చాలా సైలెంట్‌గా విజయ్ వైపు మళ్లారు. ప్రజల తీర్పును మనం విశ్లేషించలేం. ఎలాంటి బలమైన సిద్ధాంత ప్రాతిపదిక లేకుండా, కేవలం తన నటనతో జనాన్ని మెప్పించిన ఒక కొత్త ముఖం, ఇలా అనూహ్యంగా గెలవడం నిజంగా దిగ్భ్రాంతికరం.



## పేదల గృహ స్వప్నం సాకారం

**జగిత్యాలలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం**

జగిత్యాల, మే 6 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని 1వ వార్డుకు చెందిన సంబు రాయలింగు-లక్ష్మి దంపతులకు, అలాగే సంబు మల్లయ్యకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన గృహాలను ఘనంగా ప్రారంభించారు. గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ గారు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, గృహ యజమానులకు చీర కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేదల గృహ స్వప్నాన్ని సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్యప్రణవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, కౌన్సిలర్ చెట్టే గంగాధర్, కోరే గంగమ్మల్లు, కచు రాజమల్లు, దయాల కిష్టయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.



## గుర్తింపు కార్డు ఉంటేనే లాడ్జి గదులు

**పోలీసుల కఠిన నిబంధనలు**

ధర్మపురి, మే 6 (ఈవార్తలు): పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ధర్మపురి పట్టణంలోని లాడ్జ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీఐ రామ్ నర్సింహా రెడ్డి, ఎస్ఐ జి మహేష్‌తో పాటు లాడ్జ యజమానులు హాజరయ్యారు. సీఐ రామ్ నర్సింహా రెడ్డి మాట్లాడుతూ లాడ్జలలో గదులు కేటాయించే ముందు ప్రతి అతిథి నుంచి ఆధార్ లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలు తప్పనిసరిగా సేకరించాలని ఆదేశించారు. అతిథుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే లాడ్జ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవి పనిచేసేలా చూడాలని, ఫుటేజ్‌ను భద్రపరచాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులకు గదులు ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిబంధనలు పాటించని యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## మక్కల కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

**జగిత్యాలలో రైతుల ఆందోళన, స్తంభించిన ట్రాఫిక్**

జగిత్యాల, మే 6 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీట్ బజార్‌లో మక్కల కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ అన్నదాతలు ఆందోళనకు దిగారు. బీట్ చౌరస్తాలో రైతులు రోడ్డుపై కూర్చొని ధర్నా చేపట్టడంతో నిజామాబాద్--జగిత్యాల ప్రధాన రహదారిపై రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత 20 రోజులుగా మక్కలను మార్కెట్‌కు తీసుకువచ్చి కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ అధికారులు కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యామని తెలిపారు. అకాల వర్షాలు కురిస్తే పంట నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మక్కల కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేసే చర్యలు చేపట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి రాకపోకలను పునరుద్ధరించారు.



## శ్రీరాముడిపై వ్యాఖ్యలు ఖండనీయం: బీజేపీ

జగిత్యాల, మే 6 (ఈవార్తలు): హిందువుల ఆరాధ్యదైవమైన శ్రీరాముడిపై మంత్రి కొండ సురేఖ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసిఎస్ రాజు అన్నారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో "జై శ్రీరామ్" నినాదంపై చేసిన వ్యాఖ్యలు అనుచితమని, ప్రజల విశ్వాసాలను దూషించేలా ఉన్నాయని విమర్శించారు. వెంటనే మంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, నాయకులు అక్కినపల్లి కాశీనాథం, సింగం గంగాధర్, చిట్ల గంగాధర్, వేముల పోచమల్లు, బాశెట్టి దుబ్బ రాజం, వేముల దేవరాజం, నరేందుల శ్రీనివాస్, సిరిపురం గంగారాం, దొనకంటి రాజేశ్వరరావు, కొత్తకొండ బాలన్న, ఎడమల వెంకట్ రెడ్డి, కె ఆర్ కృష్ణ, సర్పంచ్ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## 12న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

జగిత్యాల, మే 6 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని ఐఎంఏ భవన్‌లో ఈ నెల 12న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మేడ్ వే క్యాన్సర్ హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరానికి సంబంధించిన బ్రోచర్లను ఐఎంఏ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 12న ఉదయం 9 గంటల నుంచి ఐఎంఏ భవన్‌లో ఉచితంగా క్యాన్సర్‌కు సంబంధించిన వివిధ రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. అన్ని రకాల క్యాన్సర్‌లపై పరీక్షలతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కూడా చేపడతామని పేర్కొన్నారు. జగిత్యాల పట్టణ ప్రజలు ఈ ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. మోహన్ రెడ్డి, డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్, డాక్టర్ హారిక, డాక్టర్ మనీష్ తదితరులు పాల్గొన్నారు.





## ఎమ్మెల్యేతో మున్సిపల్ మేనేజర్ భేటీ

జగిత్యాల, మే 6 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపల్ మేనేజర్‌గా తాజాగా బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ రషీద్ బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిపాలనకు సంబంధించిన అంశాలపై స్వల్పంగా చర్చించినట్లు తెలిసింది. పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు సమాచారం. మున్సిపల్ మేనేజర్ రషీద్ ఎమ్మెల్యేకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

## పాపికొండల యాత్ర నిలిపివేత

భద్రాచలం, మే 6 (ఈవార్తలు): తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు అధికారులు చేదువార్త చెప్పారు. గోదావరి నదిలో అత్యంత ఆదరణ పొందిన 'పాపికొండల విహారయాత్ర'ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఏపీ జలవనరుల శాఖ ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండటంతో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ యాత్రను రద్దు చేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడి, పర్యావరణం అనుకూలించిన తర్వాతే విహారయాత్రను పునరుద్ధరిస్తామని యంత్రాంగం వెల్లడించింది. యాత్ర పునఃప్రారంభానికి సంబంధించిన తదుపరి వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని, అప్పటివరకు పర్యాటకులు అధికారులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా నదీ ప్రవాహంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## రాజకీయ నాయకులకు డబుల్ ఫైన్

**హెల్మెట్ లేని నేతలకు రెట్టింపు జరిమానా**

**ఏపీ హోంమంత్రి అనిత కీలక ఆదేశాలు**

అనకాపల్లి, మే 6 (ఈవార్తలు): ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ట్రాఫిక్ నిబంధనల అమలుపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ నాయకులు హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రెట్టింపు జరిమానా విధించాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు భద్రత విషయంలో ఎవరికీ మినహాయింపులు ఉండవని, నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను అరికట్టగలమని ఆమె స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లాలో 'సురక్షిత రోడ్లు.. సురక్షిత జీవితం' నినాదంతో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అడ్డరోడ్డు నుంచి నక్కపల్లి వరకు జరిగిన ఈ బైక్ ర్యాలీలో మంత్రి అనిత మాట్లాడుతూ.. "లక్షల రూపాయలు పెట్టి బైక్ కొనేవారు, ప్రాణాలను కాపాడే వెయ్యి రూపాయల హెల్మెట్‌ను కొని ధరించడానికి ఎందుకు ఆలోచిస్తున్నారు? ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారు. ప్రాణం విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాలి" అని అన్నారు. ఈ సందర్భంగా తన పాయకరావుపేట నియోజకవర్గంలో జరిగిన రోడ్డు ప్రమాదాలను గుర్తుచేసుకుని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రాణం కంటే విలువైనది ఏదీ లేదు. మన నియోజకవర్గంలో ఒకే నెలలో జరిగిన రోడ్డు ప్రమాదాలు ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేశాయి. ఇకనైనా మేల్కొని 'హెల్మెట్ ధరిద్దాం-సురక్షితంగా పయనిద్దాం' అనే నినాదాన్ని పాటిద్దాం. మన ప్రాణాలను, మన కుటుంబాల భవిష్యత్తును కాపాడుకుందాం" అని అనిత పిలుపునిచ్చారు. ర్యాలీలో భాగంగా ఆమె పలువురు వాహనదారులకు స్వయంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని కోరారు.



## లక్ష్యంతో చదివితే గొప్ప భవిష్యత్తు

జగిత్యాల, మే 6 (ఈవార్తలు): ఇష్టంగా చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలమని కోరుట్ల ఎస్సై చిరంజీవి అన్నారు. మైనారిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎన్.ఎన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఉర్దూ మీడియం విద్యార్థిని మథీయా నాస్ (500/600) ప్రత్యేకంగా సత్కారం అందుకుంది. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఎస్సై సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు. మోసాలకు గురైతే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్వర్ సిద్ధిఖీ, అబ్దుల్ మోఖీద్, ముల్లా మసూద్, మోసిన్, వసీద్, ఆనాస్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోళ్లలో జాప్యం సహించం: సంజయ్

జగిత్యాల, మే 6 (ఈవార్తలు): మొక్కజొన్న కొనుగోళ్లలో నాలుగు వారాలుగా జరుగుతున్న జాప్యంపై ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకున్న ఆయన వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని మార్క్‌ఫెడ్ డీఎంకు ఫోన్ ద్వారా సూచించారు. రైతులు అప్పులు చేసి పంట పండిస్తే సకాలంలో కొనకపోవడం అన్యాయమని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం గ్రౌండ్ స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న మొక్కజొన్న తడిసిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతుండగా, వెంటనే కొనుగోళ్లు ప్రారంభించకపోతే నష్టాలు తప్పవని తెలిపారు. కేంద్రాల్లో సిబ్బంది కొరతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రైతు పంటను ఆలస్యం లేకుండా కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశించారు. సమస్యను త్వరగా పరిష్కరిస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

## ఐపీఎస్ విశాల్ గున్నీ సస్పెన్షన్ కొనసాగింపు

అమరావతి, మే 6 (ఈవార్తలు): సీనియర్ ఐపీఎస్ అధికారి, డీఐజీ విశాల్ గున్నీకి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. ఆయన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్) జారీ చేసిన ఉత్తర్వులపై ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. ఈ నిర్ణయంతో విశాల్ గున్నీ సస్పెన్షన్‌లోనే కొనసాగనున్నారు. విశాల్ గున్నీ సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ క్యాట్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. నిన్న ఈ పిటిషన్‌పై జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ తుహిన్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. విశాల్ గున్నీపై ఉన్నవి తీవ్రమైన ఆరోపణలని, ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే ఆయన మరో రాష్ట్రానికి వెళ్లి నటిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

వయ్యారి చిత్రం



మంజరి ఫడ్నీస్

## నకిలీ సంఘాలపై 'మా' సీరియస్

తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని నటీనటుల సంక్షేమం కోసం పని చేసే ఏకైక అధికారిక సంస్థ 'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) మాత్రమేనని, రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి ఇదొక్కటే గుర్తింపు పొందిన సంఘమని అసోసియేషన్ ఒక అధికారిక ప్రకటనలో తాజాగా వెల్లడించింది. ఇటీవల కొంతమంది వ్యక్తులు, అనధికారిక బృందాలు ఏపీ మా, మా ఏపీ వంటి తప్పుదోవ పట్టించే పేర్లతో నటీనటులను, ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మా కార్యవర్గం వెల్లడించింది. ముఖ్యంగా ఇలాంటి నకిలీ సంఘాల పేరుతో కళాకారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని సమాచారం అందడంతో 'మా' తీవ్రంగా స్పందించింది. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మరియు తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ గుర్తింపు ఉన్న ఏకైక అసోసియేషన్ తమదేనని, పరిశ్రమలోని 24 విభాగాలతో సమన్వయం చేసుకుంటూ సభ్యుల ప్రయోజనాల కోసం తాము మాత్రమే పని చేస్తున్నామని స్పష్టం చేసింది. 'మా' పేరును వాడుకుంటూ మోసాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నటీనటులు ఎవరూ ఇలాంటి అనధికారిక సంస్థలకు సభ్యత్వ రుసుములు కానీ, విరాళాలు కానీ చెల్లించవద్దని, ఏదైనా అనుమానం ఉంటే హైదరాబాద్ ఫిలింనగర్‌లోని 'మా' కార్యాలయంలో సంప్రదించాలని కోరింది. తెలుగు సినీ పరిశ్రమ గౌరవాన్ని, సమగ్రతను కాపాడేందుకు అందరూ అప్రమత్తంగా ఉండాలని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసింది.



## నితిన్‌తో రితికా నాయక్ జోడీ

యంగ్ హీరో నితిన్ తన కొత్త సినిమాను నేడు లాంఛనంగా ప్రారంభించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ఈ చిత్రం రూపొందనుంది. హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమాలతో ఈ ప్రాజెక్ట్‌ను వైభవంగా మొదలుపెట్టారు. ఈ కార్యక్రమానికి చిత్ర యూనిట్ సభ్యులు హాజరయ్యారు. ఈ సినిమాతో సోము నర్రి అనే కొత్త దర్శకుడు టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. నితిన్ సరసన 'అశోకవనంలో అర్జున కళ్యాణం' ఫేమ్ రితికా నాయక్ కథానాయికగా నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సురేష్ బొబ్బిలి సంగీతం అందించనున్నారు. ప్రస్తుతం ప్రారంభోత్సవం జరుపుకున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఈ నెల రెండో వారం నుంచి మొదలుపెట్టాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. వరుస విజయాలతో జోరుమీదున్న సితార సంస్థ, ఈ చిత్రంతో నితిన్‌కు ఒక మంచి కమర్షియల్ హిట్ అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. త్వరలోనే సినిమా టైటిల్, ఇతర నటీనటుల పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.



## సమంత 'బంగారం' వాయిదా

ప్రముఖ నటి సమంత సినిమా 'మా ఇంటి బంగారం' విడుదల వాయిదా పడింది. ఈ నెల 15న రిలీజ్ చేయాలనుకున్న ఈ చిత్రాన్ని.. జూన్ 19న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఐపీఎల్ కీలక దశకు చేరుకుంటున్న నేపథ్యంలో పోస్ట్‌పోన్ చేశారు. 'ఓ బేబీ' తర్వాత సమంత ప్రధాన పాత్రలో దర్శకురాలు నందినిరెడ్డి తెరకెక్కించిన చిత్రమిది. బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య మరో కీలక పాత్రధారి. క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందిన ఈ చిత్రంలో సమంత.. మునుపెన్నడూ చూడని లుక్‌లో కనిపించనున్నారు. ఈ సినిమాలో ఆమె ఫైట్స్ కూడా చేయడం విశేషం. తన నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై సమంత నిర్మించిన రెండో సినిమా ఇది. ఆమె భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరి సహ నిర్మాతలు.

## భాగ్యశ్రీ బోర్సే డబుల్ పోస్టర్

కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'సియోన్' నుంచి తాజాగా అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న భాగ్యశ్రీ బోర్సే పుట్టినరోజును పురస్కరించుకుని, చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ స్పెషల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో భాగ్యశ్రీ అచ్చమైన గ్రామీణ యువతిగా, నీలి రంగు చుడిదార్ ధరించి, నుదుట కుంకుమ మరియు జడలో మల్లెపూలతో ఎంతో సహజంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఆమె చేతిలో నెమలి ఈక పట్టుకుని సీరియస్ లుక్‌తో ఎవరినో హెచ్చరిస్తున్నట్లుగా ఉన్న హావభావాలు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. గాజుల దుకాణం నేపథ్యంలో ఉన్న ఈ లుక్ చూస్తుంటే ఇది పక్కా విలేజ్ బ్యాక్‌డ్రాప్ మాస్ ఎంటర్‌టైనర్ అని స్పష్టమవుతోంది. మరోవైపు, అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లెనిన్ టీమ్ భాగ్యశ్రీ స్పెషల్ పోస్టర్‌తో ఆమెకు శుభాకాంక్షలు తెలిపింది. ఈ సినిమాలో ఆమె భారతి అనే పాత్రలో అలరించనున్నారు. తాజాగా పంచుకున్న పోస్టర్‌లో ఆమె పౌరాణిక లుక్‌లో రాచరికపు దుస్తులు, భారీ ఆభరణాలు ధరించి కనిపించారు. తీక్షణమైన చూపులతో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే ఆమె పాత్ర చాలా శక్తిమంతంగా ఉండనున్నట్లు తెలుస్తోంది.




## చాలా ద్వేషించా: అవికాగోర్


'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్‌తో విశేష ఆదరణ దక్కించుకుని, 'ఉయ్యాలా జంపాలా', 'సినిమా చూపిస్త మావ'లాంటి సినిమాలతో అలరించిన నటి అవికా గోర్. కొత్త సినిమా 'అగ్లీ స్టోరీ'తో మరోసారి తెలుగు ప్రేక్షకులను పలకరించనున్నారు. బుధవారం నిర్వహించిన ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడుతూ.. కెరీర్‌లోనే తొలిసారి అసౌకర్యంగా ఫీలయ్యానని అన్నారు. ఈ సినిమాలోని పాత్రలను ఉద్దేశిస్తూ ఇలా మాట్లాడారు. 'ఈ సినిమాలో నందు తన బెస్ట్ పెర్ఫామెన్స్ ఇచ్చారు. మేం ఆశించినట్టే.. ప్రేక్షకులు ద్వేషించేలా పాత్రలో జీవించారు. ఆయనతో కలిసి నటిస్తున్నప్పుడు ఆ క్యారెక్టర్‌ను నేనూ ద్వేషించా. నిజ జీవితంలో ఇలాంటి అనుభవాలు ఎవరో ఒకరికి ఎదురవుతూనే ఉంటాయి. ఈ సినిమాతో వాస్తవాన్ని తెరపైకి తీసుకొస్తున్నాం. వినోదమే ప్రధానంగా చాలా సినిమాలు వస్తుంటాయి. కొన్ని సందేశాత్మక చిత్రాలు రూపొందుతుంటాయి. మా సినిమాలో ఈ రెండూ ఉంటాయి. ఈ చిత్ర కథ, దర్శకుడిపై నాకు ఎంతో నమ్మకం ఉంది' అని పేర్కొన్నారు. నందు, అవికా గోర్, రవితేజ మహాదాస్యం ప్రధాన పాత్రల్లో ప్రణవ స్వరూప్ తెరకెక్కించిన ఈ రొమాంటిక్ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ మే 22న విడుదల కానుంది.






## దేవిశ్రీకి జోడీగా మృణాల్!

సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ప్రధాన పాత్రలో 'బలగం' ఫేం వేణు ఎల్దండి తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఎల్లమ్మ'. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఓ తాజా అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో దేవిశ్రీకి జోడీగా సాయి పల్లవి, కీర్తి సురేశ్ నటిస్తారని జోరుగా ప్రచారం జరిగింది. ఇప్పుడు తెర పైకి మృణాల్ పేరు వచ్చింది. ప్రస్తుతం మేకర్స్ ఆమెతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఒకవేళ ఆమె ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, సినిమాపై అంచనాలు మరింత పెరుగుతాయి. మొదట 'ఎల్లమ్మ'లో హీరోలుగా నాని, నితిన్ పేర్లు వినిపించినప్పటికీ, చివరికి ఈ విభిన్నమైన పాత్ర కోసం డీఎస్పీని ఎంపిక చేశారు. ఈ సినిమాకు దేవిశ్రీనే స్వరాలు అందిస్తున్నారు. ఇప్పటికే సంక్రాంతికి విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. త్వరలోనే ఇందులోని హీరోయిన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది.




## జాన్వీ పెళ్లి ఇప్పుడే కాదు

ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్, వ్యాపారవేత్త శిఖర్ పహారియాల పెళ్లిపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి నిర్మాత బోనీ కపూర్ తెరదించారు. జాన్వీ ప్రస్తుతం పెళ్లి చేసుకునే ఉద్దేశంలో లేదని, వస్తున్న వార్తలన్నీ పుకార్లేనని ఆయన తేల్చి చెప్పారు. వీరిద్దరూ గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో లేదా తిరుమల శ్రీవారి సన్నిధిలో వివాహం చేసుకోబోతున్నారంటూ కొంత కాలంగా నెట్టింట పెద్ద ఎత్తున వార్తలు హల్చల్ చేస్తున్నాయి. ఈ తరుణంలో బోనీ కపూర్ ఇచ్చిన క్లారిటీతో ఈ పుకార్లకు ప్రస్తుతానికి బ్రేక్ పడినట్లయింది. వ్యక్తిగత విషయాలను పక్కన పెడితే, జాన్వీ కపూర్ తన కెరీర్‌లో అత్యంత కీలక దశలో ఉన్నారు. ముఖ్యంగా టాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో ఆమె బిజీగా గడుపుతున్నారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన ఆమె నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది'పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా 2026 జూన్ నెలలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. శిఖర్ పహారియాతో తనకున్న బంధం గురించి గతంలో మాట్లాడిన జాన్వీ, అతని ఉనికి తనకు ఎంతో ధైర్యాన్ని, భద్రతను ఇస్తుందని ఎమోషనల్ అయ్యారు.





# అభిషేక్ నం.1

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్

టీ20 ర్యాంకింగ్స్ జాబితాను ఐసీసీ తాజాగా విడుదల చేసింది. టీమిండియా విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాడు. టీ20 ప్రపంచ కప్ 2026 తర్వాత ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినప్పటికీ.. 875 పాయింట్లతో తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అయితే మరో స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్ రెండో స్థానానికి ఎగబాకాడు. దేశవాళీల్లో సత్తా చాటి టీమిండియాలో అవకాశం దక్కించుకున్న ఇషాన్.. అద్భుత ప్రదర్శనలు చేస్తూ వస్తోన్న సంగతి తెలిసిందే. 871 పాయింట్లతో ఇషాన్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. అయితే అభిషేక్ కంటే కేవలం 4 పాయింట్ల తేడాతోనే ఉండటం విశేషం. పాకిస్థాన్ బ్యాటర్ ఫర్హాన్(848), ఇంగ్లండ్ ప్లేయర్ ఫిల్ సాల్ట్(792) మూడు, నాలుగో స్థానాల్లో ఉన్నారు. అయితే టాప్ 8 స్థానాల్లో ఎలాంటి మార్పు లేకపోవడం గమనార్హం. శ్రీలంక బ్యాటర్ నిశాంక(766), టీమిండియా ప్లేయర్ తిలక్ వర్మ(742), సూర్యకుమార్ యాదవ్(722), బట్లర్(716) ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఇక న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో బంగ్లా ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో వారు ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానాలకు చేరుకున్నారు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన తౌహిద్ హృదయ్ రెండు స్థానాలు ఎగబాకి 37వ ర్యాంక్‌కు చేరాడు. బంగ్లా జట్టు కెప్టెన్ లిట్టన్ దాస్ కూడా ఒక స్థానం మెరుగుపర్చుకున్నాడు.

**బౌలింగ్ విభాగంలో..**

ఐసీసీ విడుదల చేసిన టీ20 ర్యాంకింగ్స్ జాబితాలో బౌలింగ్ విభాగంలో టాప్ 11 స్థానాల్లో ఎలాంటి మార్పు లేదు. అఫ్ఘనిస్థాన్ స్టార్ బౌలర్ రషీద్ ఖాన్ 753 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో వరుణ్ చక్రవర్తి(740), అబ్రార్ అహ్మద్(736), ఆదిల్ రషీద్(721), బుమ్రా(702) కొనసాగుతున్నారు. బంగ్లా బౌలర్ మహెది హసన్ 17వ స్థానానికి ఎగబాకాడు. న్యూజిలాండ్ బౌలర్ బెన్ సీర్స్ పది స్థానాలు మెరుగుపర్చుకుని 51వ స్థానానికి చేరుకున్నాడు. ఇష్ సోధీ నాలుగు స్థానాలు ఎగబాకి 88వ స్థానానికి చేరాడు.



# ఐర్లాండ్ టూర్‌కు వైభవ్

ఐపీఎల్ 2026 తర్వాత భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్‌లో సీనియర్ ప్లేయర్లకు బీసీసీఐ విశ్రాంతి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వైభవ్ సూర్యవంశీ, ప్రియాంశ్ ఆర్య వంటి యువ ప్లేయర్లకు భారత జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే, యువ ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు బీసీసీఐ.. రెండు టీ20 జట్లను తయారు చేయనున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే.



# సన్.. రైజ్

### పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి హైదరాబాద్

**పంజాబ్‌పై హైదరాబాద్ ఘన విజయం**

**20 ఓవర్లలో 235 పరుగులు చేసిన హైదరాబాద్**

**202 పరుగులకే కుప్పకూలిన పంజాబ్**

ఐపీఎల్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో ఉప్పల్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 33 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 235 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ ఏ దశలోనూ లక్ష్యాన్ని చేధించే ప్రదర్శన కనబరచలేదు. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 202 పరుగులకే పంజాబ్ కుప్పకూలింది. పంజాబ్ బ్యాట్స్‌మెన్ కూపర్ కానెల్లి ఒంటరి పోరాటం చేశాడు. 59 బంతుల్లోనే 107 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. పంజాబ్ జట్టులో మిగిలిన ఆటగాళ్లు ఎవరూ రాణించలేదు. ఈ గెలుపుతో హైదరాబాద్ పాయింట్ల పట్టికలో పంజాబ్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానంలోకి వచ్చింది. 11 మ్యాచ్‌లకు గాను 7 మ్యాచ్‌లు గెలిచి 14 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. పంజాబ్ కింగ్స్ రెండో స్థానానికి పడిపోయింది. ముందుగా బ్యాటింగ్ చేసిన హైదరాబాద్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 235 పరుగులు చేసి, ప్రత్యర్థి జట్టు పంజాబ్ కింగ్స్ ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది. టాస్ గెలిచిన పంజాబ్ బౌలింగ్ ఎంచుకుంది. హైదరాబాద్ జట్టు ఆరంభం నుంచి దూకుడుగానే ఆడింది. పంజాబ్ కింగ్స్ జట్టు ఫీల్డింగ్‌లో తేలిపోయింది. దీంతో హైదరాబాద్ భారీ పరుగులు సాధించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ 13 బంతుల్లో రెండు ఫోర్లు, రెండు సిక్సులతో 35 పరుగులు, ట్రావిస్ హెడ్ 19 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్సులతో 38 పరుగులతో ఆరంభంలోనే అదరగొట్టారు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (32 బంతుల్లో 55 పరుగులు), హెన్రిచ్ క్లాసెన్ (43 బంతుల్లో 69 పరుగులు), నితీశ్ రెడ్డి (13 బంతుల్లో 29 పరుగులు నాటౌట్)తో ఆకట్టుకున్నారు. పంజాబ్ ఆటగాళ్లు మూడు క్యాచ్‌లు, ఒక స్టంపింగ్‌ను మిస్ చేశారు. క్లాసెన్, ఇషాన్‌లు ప్రారంభంలోనే క్యాచ్‌లు ఇవ్వగా పంజాబ్ ఆటగాళ్లు జారవిడిచారు. 19 పరుగుల వద్ద ఇషాన్ మరోసారి ఇచ్చిన క్యాచ్‌ను ఫెర్గూసన్ పట్టుకోలేకపోయాడు. ఆ తర్వాత ఇషాన్‌ను స్టంపింగ్ చేసే అవకాశాన్ని కూడా చేజార్చుకుంది. 236 పరుగుల లక్ష్యంతో పంజాబ్ బరిలోకి దిగినా, లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది.

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| హైదరాబాద్ | 11 | 7 | 4 | 14 |
| పంజాబ్ | 10 | 6 | 3 | 13 |
| బెంగళూరు | 9 | 6 | 3 | 12 |
| రాజస్థాన్ | 10 | 6 | 4 | 12 |
| గుజరాత్ | 10 | 6 | 4 | 12 |
| చెన్నై | 10 | 5 | 5 | 10 |
| ఢిల్లీ | 10 | 4 | 6 | 8 |
| కోల్‌కతా | 9 | 3 | 5 | 7 |
| ముంబై | 10 | 3 | 7 | 6 |
| లక్నో | 9 | 2 | 7 | 4 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓటమి పా-పాయింట్లు



# బీసీసీఐ నిరాశకు గురిచేసింది: కర్ణాటక క్రికెట్ బోర్డు

ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించిన ప్లే ఆఫ్స్ వేదికలను బీసీసీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే బెంగళూరును కాదని అహ్మదాబాద్‌లోని నరేంద్ర స్టేడియం వేదికగా ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించేందుకు బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. ప్లే ఆఫ్స్‌లోని ఒక్క మ్యాచ్‌ను కూడా చిన్నస్వామి స్టేడియానికి కేటాయించలేదు. లోకల్ అసోసియేషన్‌తో పాటు అక్కడి అధికారులు తమ నిబంధనలకు లోబడేలా నిర్ణయం తీసుకోలేకపోయారని ఈ మేరకు బీసీసీఐ ఓ ప్రకటన జారీ చేసింది. అయితే ప్లే ఆఫ్స్‌లోని ఒక్క మ్యాచ్‌ను కూడా చిన్నస్వామిలో కేటాయించకపోవడంపై కర్ణాటక క్రికెట్ బోర్డు స్పందించింది. ఈ మేరకు అధికారిక ప్రతినిధి వినయ్ మృత్యుంజయ ప్రకటనను విడుదల చేశారు. 'కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్ వ్యక్తిగతంగా నిరంతరం బీసీసీఐ పెద్దలతో టచ్‌లో ఉన్నారు. ఐపీఎల్ ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లను నిర్వహించేందుకు చిన్నస్వామి స్టేడియం సిద్ధంగానే ఉందని ఇప్పటికే బీసీసీఐకి తెలియజేశాం. ప్రస్తుత సీజన్‌లోనూ ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణ చాలా ప్రశాంతంగా జరిగింది. క్రౌడ్ మేనేజ్‌మెంట్‌ను కూడా చక్కగా నిర్వహించాం. భారీ మ్యాచ్‌లను నిర్వహించగల సామర్థ్యం కేఎస్‌సీఏకు ఉందని నిరూపించాం. ఇప్పుడు ప్లే ఆఫ్స్‌లో ఒక్క మ్యాచ్‌ను కూడా కేటాయించకపోవడం మమ్మల్ని తీవ్ర నిరుత్సాహానికి గురి చేసింది' అని కర్ణాటక క్రికెట్ బోర్డు ప్రకటన విడుదల చేసింది.

# పాక్‌తో ఆడేది లేదు: భారత ప్రభుత్వం

పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లకు సంబంధించి భారత ప్రభుత్వం బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్తాన్‌తో ఎలాంటి ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడేది లేదని క్రీడాశాఖ మంత్రి మన్సుక్ మాండవీయ తెలిపారు. అయితే భారత్‌లో జరిగే మల్టీ నేషనల్ స్పోర్ట్స్ ఈవెంట్‌లో మాత్రం పాకిస్తాన్ అథ్లెట్లు పాల్గొనేందుకు అనుమతి ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు జాతీయ క్రీడా సమాఖ్య, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) సంయుక్తంగా సర్క్యులర్ విడుదల చేసింది. 2030 కామన్‌వెల్త్ గేమ్స్‌తో పాటు 2036 ఒలింపిక్స్‌ను నిర్వహణకు భారత్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఒలింపిక్ చార్టర్, అంతర్జాతీయ క్రీడా మార్గదర్శకాలను అనుసరించనున్నట్లు తెలిపింది. అయితే పాకిస్తాన్‌తో మాత్రం ఎలాంటి ద్వైపాక్షిక క్రీడా సంబంధాలు ఉండవని, అంతర్జాతీయ నిబంధనల ప్రకారం ఐసీసీ, ఒలింపిక్స్, కామన్‌వెల్త్, ఆసియా గేమ్స్ వంటి టోర్నీల్లో మాత్రమే భారత్, పాకిస్తాన్‌తో తలపడుతుందని క్రీడాశాఖ పునరుద్ఘాటించింది. తాజాగా విడుదల చేసిన సర్క్యులర్‌తో పాకిస్తాన్‌తో ప్రస్తుతం ఉన్న క్రీడా విధానం యథాతథంగా కొనసాగనుంది.



# అహ్మదాబాద్‌లో ఫైనల్

### ప్లే ఆఫ్స్ వేదికలు ప్రకటించిన బీసీసీఐ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ఉత్సాహభరితంగా కొనసాగుతోంది. ఇప్పటికే సగానికి పైగా మ్యాచ్‌లు ముగిశాయి. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌కు సంబంధించి ప్లే ఆఫ్స్ మ్యాచ్‌ల వేదికలను బీసీసీఐ బుధవారం అధికారికంగా ప్రకటించింది. దీంతోపాటు ఫైనల్ పోరుకు బెంగళూరు కాకుండా.. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌ను వేదికగా చేస్తూ ప్రకటన విడుదల చేసింది. ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లకు రెండు వేదికలను మాత్రమే బీసీసీఐ కేటాయించింది. మే 24తో లీగ్ స్టేజ్ మ్యాచ్‌లు ముగియనున్నాయి. 'ఫైనల్ పోరుకు తొలుత బెంగళూరును నిర్ణయించారు. అయితే మా నిర్దేశిత మార్గదర్శకాలు, నిబంధనల పరిధికి లోబడేలా లోకల్ అసోసియేషన్, అధికారుల రిక్వైర్‌మెంట్స్ లేకపోవడంతో వేదికను అహ్మదాబాద్‌కు మార్చడం జరిగింది' అని బీసీసీఐ పేర్కొంది. లీగ్ స్టేజ్ ముగిసే సరికి పాయింట్ల పట్టికలో టాప్ 4లో ఉన్న జట్లు ప్లే ఆఫ్స్‌లో తలపడతాయి. తొలి రెండు స్థానాల్లోని జట్లు మొదటి క్వాలిఫయర్ ఆడతాయి. అందులో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఓడిన టీమ్‌కు మరో అవకాశం ఉంటుంది. మూడు, నాలుగు స్థానాల్లో ఉండే జట్లు ఎలిమినేటర్‌లో తలపడతాయి. అందులో గెలిచిన జట్టు రెండో క్వాలిఫయర్‌కు అర్హత సాధిస్తుంది. క్వాలిఫయర్ 1లో ఓడిన జట్టుతో ఎలిమినేటర్ విజేత ఢీ కొడుతుంది. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. అక్కడ ఎవరైతే విజయం సాధిస్తారో ఐపీఎల్ 2026 కప్పు వారి సొంతమవుతుంది.

**క్వాలిఫయర్ 1: ధర్మశాల వేదికగా మే 26న**

**ఎలిమినేటర్: చండీగఢ్ వేదికగా మే 27న**

**క్వాలిఫయర్ 2: చండీగఢ్ వేదికగా మే 29న**

**ఫైనల్: అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా మే 31న**

# ప్లేఆఫ్స్ దాడుగుమూతలు

### రసవత్తరంగా ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసు

**టాప్-4లో పంజాబ్, బెంగళూరు, హైదరాబాద్, రాజస్థాన్**

**ఢిల్లీ, కోల్‌కతా, ముంబై జట్లకు ప్రతి మ్యాచ్ 'డూ ఆర్ డై'**

**జట్ల భవిష్యత్తును నిర్ధారించనున్న నెట్ రన్ రేట్**

ఐపీఎల్ 2026 సీజన్ ప్లేఆఫ్స్ రేసు ఊహించని మలుపులతో అత్యంత రసవత్తరంగా మారింది. లీగ్ దశ ముగింపునకు వస్తున్నా, ఏ జట్టుకూ ఇంకా ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు కాలేదు. గణాంకాల ప్రకారం ఇంకా ఏ జట్టూ అధికారికంగా రేసు నుంచి నిష్క్రమించకపోవడంతో రాబోయే ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగనుంది. ముఖ్యంగా పాయింట్ల పట్టికలో జట్ల మధ్య స్వల్ప తేడాలు మాత్రమే ఉండటంతో నెట్ రన్ రేట్ కీలకంగా మారనుంది. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్లు పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. పంజాబ్ 13 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, బెంగళూరు 12 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈ రెండు జట్లూ మెరుగైన నెట్ రన్ రేట్‌ను కలిగి ఉండటం వారికి కలిసొచ్చే అంశం. పంజాబ్ తన మిగిలిన 5 మ్యాచ్‌లలో 2 గెలిస్తే సులభంగా అర్హత సాధిస్తుంది. ఇక, ఆర్‌సీబీ ( ప్లస్ 1.420)కి ఉన్న భారీ నెట్ రన్ రేట్ వారి ప్రధాన బలం. వారు 2-3 విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్ బెర్త్ ఖాయం. సన్‌రైజర్స్ హైదరాబాద్ , రాజస్థాన్ రాయల్స్ (ఆర్‌ఆర్), గుజరాత్ టైటాన్స్ (జీటీ) జట్లు కూడా 12 పాయింట్లతో టాప్ జట్లకు గట్టి పోటీ ఇస్తున్నాయి. అయితే, ఈ మూడు జట్లు పంజాబ్, బెంగళూరు కంటే ఒక మ్యాచ్ అదనంగా ఆడాయి. హైదరాబాద్, రాజస్థాన్ పాజిటివ్ రన్ రేట్‌తో మెరుగైన స్థితిలో ఉండగా, గుజరాత్ టైటాన్స్ నెగటివ్ రన్ రేట్‌తో (-0.147) ఇబ్బంది పడుతోంది. జీటీ ప్లేఆఫ్స్ చేరాలంటే రాబోయే మ్యాచ్‌లలో భారీ విజయాలు నమోదు చేయాల్సి ఉంటుంది. మరోవైపు, సీజన్‌ను నెమ్మదిగా ప్రారంభించిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) చివరి నాలుగు మ్యాచ్‌లలో మూడు గెలిచి రేసులోకి బలంగా పుంజుకుంది. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని ఈ జట్టు, మిగిలిన 4 మ్యాచ్‌లలో కనీసం 3 గెలవడం ద్వారా 16 పాయింట్లతో ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలని చూస్తోంది. సీఎస్‌కేకి ఉన్న పాజిటివ్ నెట్ రన్ రేట్ (ప్లస్ 0.151) చివరి దశలో వారికి ఉపయోగపడవచ్చు. ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), ముంబై ఇండియన్స్ (ఎంఐ) జట్ల పరిస్థితి క్లిష్టంగా మారింది. ఢిల్లీకి ఇకపై ఒక్క ఓటమి కూడా వారి అవకాశాలను దెబ్బతీస్తుంది. మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలిస్తేనే వారికి అవకాశం ఉంటుంది. కోల్‌కతా, ముంబయి జట్లు కూడా దాదాపు ఇదే పరిస్థితిలో ఉన్నాయి. ఈ జట్లు మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలవడంతో పాటు ఇతర జట్ల ఫలితాలు కూడా




తమకు అనుకూలంగా రావాలని కోరుకోవాలి. ఈ మూడు జట్లకు వారి నెగటివ్ నెట్ రన్ రేట్ పెద్ద అవరోధంగా మారింది. లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ) అద్భుతంగా రాణించి మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలిచినా, వారి అత్యంత దారుణమైన నెట్ రన్ రేట్ (-1.076) కారణంగా ప్లేఆఫ్స్ చేరడం దాదాపు అసాధ్యం. మొత్తం మీద రాబోయే రెండు వారాలు అభిమానులకు అసలైన టీ20 మజాను పంచనున్నాయి. ప్రతి పరుగు, ప్రతి వికెట్ పాయింట్ల పట్టికను, జట్ల భవిష్యత్తును మార్చే అవకాశం ఉండటంతో ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసు చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగడం ఖాయం.

ఈవార్తలు
# ప్రజావాణి
గురువారం 7-5-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# టీవీకేకు 'గవర్నర్' ఫికర్

తమిళనాడు రాజకీయాల్లో ఆరు దశాబ్దాల ద్రవిడ ఆధిపత్యాన్ని సవాల్ చేస్తూ టీవీకే సాధించిన విజయం చారిత్రాత్మకమైనది. అయితే, ఎన్నికల ఫలితాల తర్వాత ఏర్పడిన రాజకీయ ప్రతిష్ఠంభన ఇప్పుడు రాజ్యాంగపరమైన చర్చకు దారితీస్తోంది. 234 స్థానాలున్న అసెంబ్లీలో 118 స్థానాలు ఉంటేనే పూర్తి మెజారిటీ లభిస్తుంది. విజయ్ పార్టీ 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా నిలిచినప్పటికీ, మ్యాజిక్ ఫిగర్‌కు 10 సీట్ల దూరంలో నిలిచిపోయింది. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కోరగా, సంఖ్యాబలం (118) స్పష్టంగా ఉండాలని గవర్నర్ సూచించినట్లు తెలుస్తోంది. సాధారణంగా హంగ్ అసెంబ్లీ ఏర్పడినప్పుడు, సర్కారియా కమిషన్ సిఫార్సుల ప్రకారం, ఏ పార్టీకి పూర్తి మెజారిటీ లేనప్పుడు అతిపెద్ద పార్టీని పిలిచి, సభలో మెజారిటీ నిరూపించుకోమని సమయం ఇవ్వవచ్చు. ఇప్పటికే కాంగ్రెస్ (5 సీట్లు), ఇతర చిన్న పార్టీలు టీవీకేకు మద్దతు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు సంకేతాలు ఇచ్చాయి. ఈ మద్దతుతో టీవీకే బలం 113 నుండి 115 వరకు చేరుతున్నప్పటికీ, 118కి ఇంకా కొన్ని సీట్లు తక్కువగానే ఉన్నాయి. విజయ్ ఇప్పుడు 'క్రౌడ్ పుల్లర్' నుంచి 'కూటమి నిర్మాత'గా మారాల్సిన పరిస్థితి ఉంది. కాంగ్రెస్, వామపక్ష పార్టీలు లేదా స్వతంత్రుల మద్దతును కూడగట్టి, గవర్నర్‌కు ఆ జాబితాను సమర్పించడమే విజయ్ ముందున్న మార్గం. ప్రజలు మార్పును కోరుతూ టీవీకేను అతిపెద్ద పార్టీగా నిలబెట్టారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవిస్తూ, సుస్థిర ప్రభుత్వం ఏర్పడేలా చూడటమే గవర్నర్ బాధ్యత. అయితే, సాంకేతిక అంశాలను సాకుగా చూపి కాలయాపన చేయడం వల్ల 'గుర్రాల బేరాలకు' అవకాశం ఏర్పడే ప్రమాదం ఉంది. త్వరగా ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం ద్వారా తమిళనాట రాజకీయ అనిశ్చితికి తెరదించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# విద్య.. ర్యాంకులు.. వ్యక్తిత్వం


రామస్వామి చింత
అచ్చంపేట

**ఒకప్పుడు విద్య అంటే అజ్ఞానాన్ని పోగొట్టి, విజ్ఞానాన్ని ప్రసాదించే అమృత భాండాగారం. కానీ నేడు విద్యావ్యవస్థ ఒక "మార్కుల యంత్రం"గా, విద్యాసంస్థలు "ర్యాంకుల కర్మాగారాలు"గా మారిపోయాయి. ఉదయం సూర్యోదయం కాకముందే మొదలై, అర్ధరాత్రి వరకు సాగే పుస్తకాల కుస్తీలో నేటి విద్యార్థి తన బాల్యాన్ని, సృజనాత్మకతను కోల్పోతున్నాడు. నేటి సమాజంలో విద్యార్థి విలువను అతని ప్రవర్తనను బట్టి కాకుండా, అతను సాధించిన 'పర్సంటైల్' బట్టి కొలుస్తున్నారు.**

కార్పొరేట్ విద్యాసంస్థల మధ్య నెలకొన్న వ్యాపార పోటీలో విద్యార్థులు కేవలం అంకెలుగా మారిపోయారు. ఐఐటీ, నీట్ వంటి ప్రవేశ పరీక్షలే జీవిత పరమావధిగా చిత్రీకరించడం వల్ల విద్యార్థుల్లో తీవ్రమైన మానసిక ఆందోళన, నిరాశ పెరుగుతున్నాయి. క్రీడలు, కళలు, కనీసం తోటివారితో మాట్లాడే సమయం కూడా లేని 'కోడింగ్' బానిసలుగా విద్యార్థులు మారుతున్నారు. పుస్తకాల్లోని పాఠాలు వంటబట్టినట్లుగా, సామాజిక బాధ్యతలు విద్యార్థులకు అలవడటం లేదు. కేవలం పోటీలో గెలవడమే ముఖ్యం అనుకోవడం వల్ల.. ఇతరులకు సహాయం చేయడం, సహానుభూతి, నిజాయితీ వంటి లక్షణాలు కరువవుతున్నాయి. ఎప్పుడూ మొదటి స్థానంలో ఉండాలని కోరుకునే విద్యార్థులు, చిన్న విఫలాన్ని కూడా భరించలేక ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నారు. పిల్లల మార్కుల షీటును తమ సామాజిక గౌరవానికి చిహ్నంగా చూడటం తల్లిదండ్రులు మానుకోవాలి. పక్కింటి అబ్బాయితోనో, క్లాస్ టాపర్‌తోనో పోల్చి పిల్లల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకూడదు. కేవలం ఇంజనీరింగ్, మెడిసిన్ మాత్రమే కాకుండా వేల సంఖ్యలో ఉన్న ఇతర వృత్తి విద్యా కోర్సుల పట్ల అవగాహన పెంచుకోవాలి. పాఠ్యాంశాల్లో మార్కులతో పాటు 'జీవన నైపుణ్యాల'కు ప్రాధాన్యం ఇవ్వాలి. నైతిక విలువల బోధన కేవలం ఒక పీరియడ్‌కు పరిమితం కాకుండా, విద్యార్థి ప్రవర్తనలో భాగం కావాలి. ప్రతి విద్యాసంస్థలో విద్యార్థుల మనోభావాలను పంచుకోవడానికి నిపుణులైన కౌన్సిలర్లు ఉండాలి. ర్యాంకులు కెరీర్‌కు పునాది కావచ్చు, కానీ సంస్కారం మాత్రమే జీవితాన్ని సార్థకం చేస్తుంది. విద్యార్థిని ఒక 'ర్యాంక్ హోల్డర్'గా మాత్రమే కాకుండా, ఒక బాధ్యతాయుతమైన 'పౌరుడిగా' తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యాసంస్థలు, తల్లిదండ్రులు మరియు ప్రభుత్వంపై ఉంది. అప్పుడే మనం ఆరోగ్యకరమైన, నైతిక విలువలతో కూడిన భవిష్యత్తు సమాజాన్ని నిర్మించగలం.



# అపరిమిత అవకాశాల యుగం


రణధీర్ గుండు

కృత్రిమ మేధస్సు నేడు మానవ నాగరికతలో ఒక చారిత్రాత్మక మలుపుగా నిలుస్తోంది. అగ్ని ఆవిష్కరణ లేదా పారిశ్రామిక విప్లవం ప్రపంచాన్ని ఎలా మార్చాయో, అంతకంటే వేగంగా ఏఐ మన జీవితాలను ప్రభావితం చేస్తోంది. ఏఐ సహాయంతో పనులు మునుపటి కంటే వేగంగా, కచ్చితంగా పూర్తవుతున్నాయి. ముఖ్యంగా డేటా విశ్లేషణ, కోడింగ్, కస్టమర్ సర్వీస్ వంటి రంగాల్లో ఏఐ మానవ శ్రమను గణనీయంగా తగ్గించింది. వ్యాధులను ముందస్తుగా గుర్తించడంలో ఏఐ ప్రాణదాతగా మారుతోంది. క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించడం, కొత్త ఔషధాల తయారీని వేగవంతం చేయడం దీనివల్ల సాధ్యమవుతోంది. ప్రతి విద్యార్థి నేర్చుకునే వేగాన్ని బట్టి బోధనా పద్ధతులను ఏఐ మారుస్తుంది. దీనివల్ల విద్య మరింత అందుబాటులోకి రావడమే కాకుండా, నాణ్యత కూడా పెరుగుతుంది. ప్రమాదకరమైన పనులు (ఉదాహరణకు గనుల్లో పని, బాంబు నిర్వీర్యం) రోబోల ద్వారా చేయడం వల్ల మానవ ప్రాణనష్టం తప్పుతుంది. డ్రైవర్ రహిత కార్ల ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అనేక రంగాలు ప్రభావితం

ఏఐ వల్ల పునరావృతమయ్యే పనులు చేసే ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. డేటా ఎంట్రీ నుండి గ్రాఫిక్ డిజైనింగ్ వరకు అనేక రంగాలు ప్రభావితమవుతున్నాయి. మన వ్యక్తిగత డేటాను ఏఐ విశ్లేషించడం వల్ల గోప్యతకు భంగం కలిగే అవకాశం ఉంది. సైబర్ నేరగాళ్లు ఏఐని ఉపయోగించి డీప్ ఫేక్స్ వంటి వాటితో సమాజాన్ని తప్పుదోవ పట్టించవచ్చు. ఒక ఏఐ అల్గారిథం తప్పుడు నిర్ణయం తీసుకుంటే దానికి బాధ్యులు ఎవరు? అనే ప్రశ్న తలెత్తుతోంది. అలాగే ఏఐ నిర్ణయాల్లో పక్షపాతం ఉండే అవకాశం కూడా ఉంది. యంత్రాలతో సంభాషణ పెరగడం వల్ల మనుషుల మధ్య సహజమైన సామాజిక సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఏఐ అనేది ఒక రెండు అంచుల కత్తి. దీన్ని మనం ఎలా ఉపయోగిస్తామనే దానిపైనే మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఏఐని కేవలం మానవ సామర్థ్యాన్ని పెంచే ఒక సాధనంగా చూడాలి తప్ప, మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా భావించకూడదు. సరైన ప్రభుత్వ నిబంధనలు, నైతిక విలువల పర్యవేక్షణ ఉన్నప్పుడే ఏఐ మానవాళికి వరంలా మారుతుంది.

విద్యలో ఏఐ

మానవ నాగరికత చరిత్రలో నిప్పు, చక్రం, విద్యుత్తు వంటి ఆవిష్కరణలు ఎలాగైతే ప్రపంచ గమనాన్ని మార్చాయో, నేడు 'కృత్రిమ మేధ' అంతకంటే వేగంగా విద్యా వ్యవస్థను మలుపు తిప్పుతోంది. కేవలం పారిశ్రామిక రంగానికే పరిమితం కాకుండా, పాఠశాల గదుల్లో అడుగుపెడుతున్న ఏఐ.. భవిష్యత్తు తరాలను ఎలా తీర్చిదిద్దబోతోందనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తి కలిగిస్తోంది. భారత ప్రభుత్వం 2026-27 విద్యా సంవత్సరం నుండి దేశవ్యాప్తంగా పాఠశాలల్లో 3వ తరగతి నుంచే ఏఐని ఒక తప్పనిసరి అంశంగా ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. విద్యార్థులను భావి సాంకేతిక ప్రపంచానికి సిద్ధం చేయడమే లక్ష్యంగా సీబీఎస్ఈ ఇప్పటికే ప్రత్యేక పాఠ్య ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇది కేవలం ఒక సబ్జెక్టు మాత్రమే కాదు, విద్యార్థుల ఆలోచనా సరళిని మార్చే ఒక శక్తివంతమైన సాధనం. ప్రతి విద్యార్థి గ్రహణ శక్తి ఒకేలా ఉండదు. ఏఐ ట్యూటర్లు విద్యార్థి సామర్థ్యాన్ని బట్టి పాఠాలను బోధిస్తాయి, దీనివల్ల వెనుకబడిన పిల్లలు కూడా సులభంగా అర్థం చేసుకోగలరు. అటెండెన్స్, మార్కుల నమోదు వంటి పరిపాలనా పనుల భారం ఏఐతో తగ్గుతుంది. దీనివల్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు సృజనాత్మకతను నేర్పడంపై ఎక్కువ సమయం వెచ్చించవచ్చు. మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్యా సమాచారం, అనువాద సౌకర్యాల ద్వారా ఏఐ అందుబాటులోకి తెస్తుంది. ఏఐ రాకతో కొన్ని సవాళ్లు కూడా పొంచి ఉన్నాయి. దాదాపు కోటి మంది ఉపాధ్యాయులకు ఈ టెక్నాలజీపై శిక్షణ ఇవ్వడం ఇప్పుడు అతిపెద్ద సవాలు. అలాగే విద్యార్థులు సొంతంగా ఆలోచించే శక్తిని కోల్పోయి, ఏఐపై అతిగా ఆధారపడే ప్రమాదం ఉంది. డేటా గోప్యత, నైతిక విలువలు వంటి అంశాలపై కూడా స్పష్టమైన నిబంధనలు అవసరం.

# ఆధునిక ఆరోగ్యం..!



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానవుడు భౌతిక సుఖాల వెంట పడుతూ తన ప్రాథమిక సంపదైన ఆరోగ్యాన్ని విస్మరిస్తున్నాడు. ఆధునిక ఆహారపు అలవాట్లు, నిరంతర ఒత్తిడి మనిషిని రోగాల కుంపటిలోకి నెట్టేస్తున్నాయి. ఈ తరుణంలో యోగా వంటి ప్రాచీన భారతీయ సంప్రదాయాలు కేవలం వ్యాయామాలుగానే కాకుండా, సంపూర్ణ ఆరోగ్యానికి మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి. నేడు 'రుచికే ప్రాధాన్యత – ఆరోగ్యం తర్వాత' అనే ధోరణి పెరిగింది. ఫాస్ట్ ఫుడ్స్, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, అధిక చక్కెర మరియు ఉప్పుతో కూడిన పదార్థాలు శరీరంలో విషతుల్యాలను పెంచుతున్నాయి. ఈ అలవాట్లు స్థూలకాయం, మధుమేహం, గుండె జబ్బులు మరియు జీర్ణకోశ వ్యాధులకు ప్రధాన కారణమవుతున్నాయి. కేవలం జిహ్వా చాపల్యం కోసం తీసుకునే ఈ ఆహారం శరీరానికి అవసరమైన పోషకాలను అందించకపోగా, రోగనిరోధక శక్తిని నిర్వీర్యం చేస్తోంది. డిజిటల్ ప్రపంచంలో పని భారం, పోటీ తత్వం మరియు నిరంతర వేగం మనిషిని మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఒత్తిడి అనేది కేవలం మనసుకే పరిమితం కాకుండా, శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీసి నిద్రలేమి, రక్తపోటు వంటి సమస్యలకు దారితీస్తోంది. 21వ శతాబ్దపు అతిపెద్ద సవాలుగా పరిగణించబడుతున్న ఈ ఒత్తిడిని అధిగమించడం నేడు అనివార్యం. యోగా అనేది కేవలం కొన్ని భంగిమల సమాహారం కాదు; అది శరీరం, మనస్సు, ఆత్మను అనుసంధానించే ప్రక్రియ. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది, కండరాలు, కీళ్లు బలోపేతం అవుతాయి. ప్రాణాయామం, ధ్యానం వంటి పద్ధతులు మెదడును ప్రశాంతంగా ఉంచి, ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తాయి. యోగా వల్ల శరీరంలోని విషతుల్యాలు బయటకు వెళ్లి రోగనిరోధక శక్తి పెరుగుతుంది, ఇది ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ ఇస్తుంది. ముఖ్యంగా విద్యార్థులకు మరియు ఉద్యోగులకు యోగా వల్ల ఏకాగ్రత, క్రమశిక్షణ, పని సామర్థ్యం పెరుగుతాయి. ఆరోగ్యం అంటే కేవలం వ్యాధులు లేకపోవడం కాదు, శారీరక మరియు మానసిక ప్రశాంతతను కలిగి ఉండటం. మన ఆహారపు అలవాట్లను మార్చుకుంటూ, రోజులో కనీసం 30 నుండి 45 నిమిషాల పాటు యోగాను జీవనశైలిలో భాగం చేసుకోవాలి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు యోగాపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ, వ్యక్తిగత బాధ్యతగా ప్రతి ఒక్కరూ యోగా వైపు అడుగులు వేసినప్పుడే 'ఆరోగ్య భారతం' సాధ్యమవుతుంది.

**- వల్లీశ్వరి కుమార్,**
**మానసిక వైద్యనిపుణురాలు**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.